RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 73 Issue No.73 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: గురువారం 12-03-2026 Thursday, March 12 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## వివేకా హత్య కేసు 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలి

### ట్రయల్ కోర్టుకు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ, మార్చి 11 (ఆర్ఎన్ఎ):** మాజీ మంత్రి వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో మూడో సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. తమ దర్యాప్తు పూర్తి చేసినట్లు సీబీఐ

మిగతా 2లో..





# సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమస్యల ఆకళింపు
- 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు
- ఉగాదికి 2.50 లక్షల లబ్దిదారులకు సామూహిక గృహప్రవేశాలు
- రానున్న కాలంలో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గించేలా చర్యలు
- సౌర వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి
- కలెక్టర్లకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. అధికారులు-ప్రజాప్రతినిధుల కార్యక్రమాలపై సీఎం కార్యాచరణ ప్రకటించారు. గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చాం. నిర్దేశిత లక్ష్యాలను

మిగతా 2లో..

## పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల తీరుపై మండిపడ్డ ప్రధాని
- గల్ఫ్‌లో చిక్కుకున్న వారిని ఇండియాకు తీసుకుని వస్తున్నాం
- కేరళం పర్యటనలో మోడీ ఘాటుగా విమర్శలు



**తిరువనంతపురం, మార్చి 11 (ఆర్ఎన్ఎ):** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని

మిగతా 2లో..

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసంపై చర్చ

- విపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకున్నారన్న రాహుల్
- స్పీకర్‌ను అవమానించినా భరించారన్న రవిశంకర్ ప్రసాద్



**న్యూఢిల్లీ, మార్చి 11 (ఆర్ఎన్ఎ):** పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత మాట్లాడకుండా స్పీకర్ ఓం బిర్లా అనేక సార్లు అడ్డుకున్నారని కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ చర్చ ప్రజాస్వామ్యం అన్నారు. పదే పదే స్పీకర్ ఓం బిర్లా తనను మాట్లాడకుండా అడ్డుకున్నారని.. లోక్‌సభ అనేది దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించలేదని రాహుల్ గాంధీ అనగానే? బీజేపీ ఎంపీ రవి శంకర్ ప్రసాద్ కలుగజేసుకుని.. ఎప్పుడూ? ఎప్పుడూ? ఎప్పుడూ అని అడిగారు. ప్రధాని మోడీ, స్పీకర్ కుర్చీని విపక్ష సభ్యులు చాలాసార్లు చుట్టుముట్టారని, కాగితాలు విసిరారని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. కానీ స్పీకర్ ఎప్పుడూ నవ్వుతూనే ఉన్నారని

మిగతా 2లో..

## మహిళా సమస్యల పరిష్కారమే అజెండాగా జన్ సున్వాయ్

- వేగవంతంగా, పారదర్శకంగా సమస్యల పరిష్కారానికి చొరవ
- రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ





**విజయవాడ, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని గోపాల్ రెడ్డి రోడ్డు నందుగల జల వనరుల నిర్వహణ, సమగ్ర రైతు శిక్షణ కేంద్రంలో ఉమ్మడి కృష్ణాజిల్లా (ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు) నుంచి వచ్చిన మహిళల ఫిర్యాదుల విచారణతో పాటు కొత్త ఫిర్యాదులను స్వీకరించి విచారించారు. అనంతరం మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..... 9వ తేదీన నెల్లూరు జిల్లాలో జన్ సున్వాయ్ కార్యక్రమాన్ని మొదలుపెట్టామన్నారు. ఈనెల 13వ తేదీ విశాఖపట్నంతో జన్ సున్వాయ్ కార్యక్రమం మొదటి దశ పూర్తవుతుందన్నారు. ఇప్పటినుంచి ప్రతి జిల్లాలో మహిళా

మిగతా 2లో..

## గుడివాడ కేంద్రంగా బెట్టింగ్

### కొడాలి నాని అనుచరుడు సహా ఐదుగురి అరెస్టు





**గుడివాడ, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృష్ణా జిల్లా గుడివాడలో బెట్టింగ్‌లకు పాల్పడుతున్న మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు మసాలా శివతో పాటు మరో నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. బెట్టింగ్ రాయుళ్ల నుంచి రూ.1.05 లక్షల నగదు, 8 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిడ్కో కాలనీ ఫ్లాట్లలో మసాల శివ, అతని అనుచరులు యాప్‌లలో వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ బెట్టింగ్‌కు పాల్పడ్డారు. మసాల శివ ఫోన్‌లో పలువురు పోలీసు అధికారుల వ్యక్తిగత, వైకాపా ముఖ్య నేతల నెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ లావాదేవీలకు సంబంధించి వాట్సప్ చాటింగ్, ఫోన్ స్క్రీన్ షాట్లను గుర్తించామని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకుడు మసాలా శివ,

మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ సంఖ్యలో లొంగిపోయిన మావోయిస్టులు





**భద్రాచలం, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పుర్‌లో పోలీసుల ఎదుట భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. 108 మంది తమ ఆయుధాలను అప్పగించి లొంగిపోయారు. వారిపై రూ.3.29 కోట్ల రివార్డు ఉంది. లొంగిపోయిన వారిలో 44 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. వీరి వద్ద నుంచి 101 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. భారీ డంపును కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అందులో రూ.3.61 కోట్ల నగదు, రూ.1.64 కోట్ల విలువైన కిలో బంగారం లభ్యమైనట్లు పేర్కొన్నారు. మావోయిస్టుల పునరావాస పథకంలో భాగంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత 26 నెలల్లో మొత్తం 2,714 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిశారు.

## అయోధ్యను తాకిన వంటగ్యాస్ కొరత





**అయోధ్య, మార్చి 11 (ఆర్ఎన్ఎ):** ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ వ్యాప్తంగా చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం నెలకొన్న విషయం తెలిసిందే. దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని ఓవైపు కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో గ్యాస్ కొరత ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రభావం అయోధ్య ఆలయంపై కూడా పడింది. ఎల్‌పీజీ సిలిండర్ల కొరత కారణంగా అమావా ఆలయంలోని రామ్ రసోయీ (అన్నదాన కేంద్రం)ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఈ మేరకు అన్నదాన కేంద్రం వద్ద నోటీసులు

మిగతా 2లో..

## కేంద్ర మాజీ మంత్రి కావూరి మృతి

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణం
- కావూరి మృతిపై చంద్రబాబు తదితరుల సంతాపం



(ఫైల్ ఫొటో)

**హైదరాబాద్, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు తనదైన ముద్ర వేసిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు (82) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కావూరి సాంబశివరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎంపిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. మన్మోమన్ కేబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం రాజకీయ రంగానికి తీరని లోటుగా పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు నేతలు కావూరి సాంబశివరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. మచిలీపట్నం, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఎంపీగా

మిగతా 2లో..

## డ్వాక్రా ఉత్పత్తులను ప్రమోట్ చేయాలి

### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం



**అమరావతి, మార్చి 11 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డ్వాక్రా ఉత్పత్తులను ప్రమోట్ చేయాలని ఏపీ సీఎం చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించారు. వీటిని 'స్వయం' బ్రాండ్ పేరుతో ప్రమోట్ చేస్తున్నట్లు వివరించారు. కలెక్టర్లతో నిర్వహించిన భేటీలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్' అంశంపై ఆయన మాట్లాడారు. డ్వాక్రా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అమూల్ తరహాలో స్వయం బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ చేయాలని తెలిపారు. "డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు స్వయం పేరిట బ్రాండింగ్.. లోగో ఏర్పాటు చేశాం. మల్టీ బిలియన్ డాలర్ల కంపెనీ తరహాలో బ్రాండింగ్‌కు కృషి చేయాలి. అమూల్ తరహాలోనే సహకార విధానంలో మార్కెటింగ్ జరగాలి. డ్వాక్రా మహిళలు రుణాలను తప్పకుండా తిరిగి చెల్లిస్తారు. వారికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు వస్తాయి" అని తెలిపారు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# జల్‌జీవన్‌తో శాశ్వత నీటి సమస్య పరిష్కారం అయ్యేనా?

ఏటా వరదలు, నీటి కరువు సాధారణం అయ్యింది. వర్షాకాలంలో వరదలు ముంచెత్తితే..ఎండాకాలంలో మంచినీటి కటకటలు తప్పడం లేదు. ఈ సమస్య పరిష్కరానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సమస్యపై స్పష్టమైన అవగాహన కలగడం లేదు. మనకు ఎన్నో జీవనదులు, సహజసిద్ధ వనరులు ఉన్నా, వాటిని వినియోగించడం ఎలా అన్న ఆలోచన చేయడం లేదు. ఎండాకాలం రాగానే తాత్కాలిక పథకాలతో మంచినీటి సమస్యను గట్టెక్కిస్తున్నారు. ఇకపోతే కేంద్రం జల్‌జీవన్ మిషన్ కింద లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా..శాశ్వత పరిష్కారం చూపడం లేదు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందించే జల్ జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని కేంద్ర ప్రభుత్వం 2028 డిసెంబరు వరకు పొడిగించింది. 2019-2024 వరకే పరిమితమైన ఈ పథకం చాలా రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో అమలుకాని విషయాన్ని ప్రభుత్వం పరిగణనలో తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ పథకం మొత్తం కేటాయింపులను రూ.8.69 లక్షల కోట్లకు పెంచింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన రూ.2.08 లక్షల కోట్ల నుంచి రూ.3.59 లక్షల కోట్లకు పెంచాలని నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రాలకు రూ.1.51 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం కలగనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు జాతీయస్థాయిలో సుజలం భారత్ పేరుతో ఒక డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తేనుంది. దీనికింద ప్రతి పల్లెను ఒక సుజల గ్రామంగా గుర్తించి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఈ పథకం కింద చేపట్టిన పనులు పూర్తయినట్లు గ్రామపంచాయతీలు ధ్రువీకరించి, ప్రతి ఇంటికీ కొళాయి నీరు అందించేందుకు సిద్ధమైనట్లు ప్రకటించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే పథకం నిర్వహణకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తాయి. పథకాన్ని ప్రజలు సొంతం చేసుకొని సామాజికంగా, ఉమ్మడిగా నిర్వహించేలా ప్రోత్సహించేందుకు ఏటా 'జల్ ఉత్సవ్' కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని గ్రామాలనూ 'హర్‌ఘర్ జల్' గ్రామాలుగా తయారు చేస్తామని ప్రకటించారు. అయితే ఈ పథకానికి అవసరమైన నీటి వనరులను సమకూర్చడంలో మాత్రం రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. జల్‌జీవన్ పథకం అమల్లో ఉన్నా గ్రామాల్లో మంచినీటి సమస్యలు తీరడం లేదు. కారణం నీటి వనరులను వినియోగించక పోవడమే. వేసవి వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణ మైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనారాహిత్యంతో పాటు ప్రకృతి సహాయనిరాకరణ కూడా తోడుకావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు. ప్రజల్లో అవ గాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రాను రాను తీవ్ర రూపం దాల్చుతున్నది. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి నుంచే పటిష్టమైన ప్రణాళికతో యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారం అదుపు లేకుండాపోతున్నది. ఇప్పుడు ఈ వ్యాపారం నగరాలకేకాక, మండల కేంద్రాలకు, గ్రామాలకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా మంచినీటి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నాఅడిగేవారు, అడ్డగిం చేవారు లేకుండా పోతున్నారు. కలుషితనీరు అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయి. పాలకులు మంచినీటి విషయంలో ప్రత్యేక చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏ మాత్రం క్షేమంకాదు. ఇకపోతే లక్షలాది ఎకరాలకు సరి పోయే వేలాది టిఎంసిల నీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా సముద్రంపాలవుతున్నది. ఇప్పటికీ దేశంలోని ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించ లేని అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాం.దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. పెడుతున్నారు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్ర స్థాయి వరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యతీవ్రంగా ఉంటుంది. ఈసారి వేసవిలో నీటికొరత తీవ్రంగా ఉండే అవకాశాలు న్నట్లు భూగర్భశాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. బోరు బావుల వినియోగం దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపో తున్నది. విద్యుత్ డిమాండ్ తోపాటు నీటి వృధా కూడా పెరుగు తున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశం లోని అనేక రాష్ట్రాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ బోరుబావుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తున్నది. భూగర్భ జలాల వినియోగం మూడింతలు పెరగడం వల్ల భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. దేశరాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజ స్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్లో ఇష్టానుసారంగా లక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని గతంలోనే కేంద్రం అంగీకరించింది. రాబోయే వేసవిలో మంచినీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది.

# అమెరికాలో రిలయన్స్ ఆయిల్ రిఫైనరీ

### 300 బిలియన్ డాలర్లతో భారీ ప్రాజెక్ట్... రిలయన్స్‌తో అమెరికా ప్రభుత్వం ఒప్పందం... సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్





**వాషింగ్టన్,మార్చి11(ఆర్ఎన్ఎ):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 300 బిలియన్ డాలర్ల చమురు శుద్ధి కర్మాగార ప్రాజెక్టును టెక్సాస్‌లో ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో భారతదేశ రిలయన్స్ ఇండస్ట్రీ భాగస్వామి క ఆవడం విశేషం. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఈ ప్రాజెక్టును అమెరికా చరిత్రలో అతిపెద్ద ఒప్పందం గా పేర్కొన్నారు. ఇది అమెరికన్ కార్మికులు, ఇంధన వృద్ధి, దక్షిణ టెక్సాస్ ప్రజలకు భారీ విజయం అని అభివర్ణించారు. ట్రంప్ ప్రకటన ప్రకారం.. ఈ ప్రాజెక్టు దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయడానికి, పారిశ్రామిక పెట్టుబడులను విస్తరించడానికి ఓ ముఖ్యమైన దశగా ఉంటుంది. బ్రౌన్స్‌విల్లే నౌకాశ్రయంలో ఉనికిలో ఉండే అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తుంది. ట్రంప్ ఈ ప్రాజెక్టును ఆర్థిక, వ్యూహాత్మక మైలురాయిగా పేర్కొన్నారు. అయితే, పెట్టుబడి నిర్మాణం, ఖర్చులు లేదా ఆర్థిక వివరాలపై ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. గత 50 ఏళ్లలో అమెరికా గడ్డపై నిర్మించతలపెట్టిన మొట్టమొదటి రిఫైనరీ ఇదే కావడం విశేషం. ఈ మెగా ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ 'రిలయన్స్' కీలక భాగస్వామిగా చేరడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. సుమారు 300 బిలియన్ల డాలర్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా అమెరికా-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన మరియు అత్యాధునికమైన రిఫైరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ కుదుర్చుకున్నందుకు రిలయన్స్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాలకు గెలుపు లాంటిదని అభివర్ణించారు. ఈ భారీ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, అమెరికా ఇంధన భద్రతను గణనీయంగా పెంచనుంది. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, టెక్సాస్ ప్రాంత ఆర్థిక పురోగతికి ఇది కీలకం కానుంది. పర్యావరణ హితంగా ఉండేలా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఇంధనాన్ని శుద్ధి చేయడం దీని ప్రత్యేకత. గతంలో పెట్రోలియం రంగంలో రిలయన్స్‌కు ఉన్న అపారమైన అనుభవం, ముఖ్యంగా జామ్‌నగర్ వంటి అతిపెద్ద రిఫైనరీల నిర్వహణ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ట్రంప్ యంత్రాంగం ఈ డీల్‌కు మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందం వల్ల అమెరికా చమురు దిగుమతుల పై ఆధారపడటం తగ్గి, అంతర్జాతీయ మార్కెట్లో తన పట్టును మరింత బిగించే అవకాశం ఉంది. ఇది అమెరికాలో ఇంధన ఉత్పత్తిని పెంచి, బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శుభ్రమైన శుద్ధి కర్మాగారంగా ఇది నిలుస్తుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే 2024లో డల్లాస్ ప్రాంతానికి చెందిన స్టార్టప్ సంస్థ ఎలిమెంట్ ఫ్యూయల్స్ హోల్డింగ్స్ బ్రౌన్స్‌విల్లేలో దాదాపు 50 సంవత్సరాల తర్వాత పూర్తిగా కొత్త అమెరికన్ చమురు శుద్ధి కర్మాగారం నిర్మించేందుకు ప్రణాళికను తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే అమెరికా ఇంధన రంగంలో పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు భారత్-అమెరికా ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తిరుమలపై అనకొండలను పంపిస్తున్న జగన్

### ఆదిశేషుడి ముందు అనకొండలు ఏమీ చేయలేవు... ఆనాడే పరకామణి చోరీ కేసును ఎందుకు తొక్కి పెట్టారు

### కమిషన్లు తీసుకోలేదని కాణిపాకంలో ప్రమాణం చేస్తారా... మాజీ టిటిడి ఛైర్మన్ భూమనకు భానుప్రకాశ్ సవాల్



**తిరుపతి,మార్చి11(ఆర్ఎన్ఎ):** తాడేపల్లి ఆదేవాలతో తిరుమలపై అసత్య ప్రచారాలకు పాల్పడతున్నారని, తిరుమలను లక్ష్యంగా చేసుకుని వైకాపా నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిలో ఉన్న జగన్.. ఏడుకొండలపైకి అనకొండలను పంపిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని అనకొండలు వచ్చినా ఆదిశేషుడి ముందు తోక ఆడించలేరని మండిపడ్డారు. 11 నెలల క్రితం జరిగిన ఘటనను నిన్న జరిగినట్లుగా కరుణాకర్ రెడ్డి నానా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. పరకామణిలో చోరీకి యత్నించినప్పుడు పెంచలయ్య అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని మేం జైలుకు పంపాం. గతంలో రవికుమార్ దొరికితే మీరేం చేశారు? వాటాలు పంచుకుంది మీరు కాదా? విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ ద్వారా రవికుమార్ విజువల్స్‌ను మాయం చేసింది మీరు కాదా? శ్రీవారి హుండీలో కానుకలు పడకుండా వైకాపా కుట్ర చేస్తోంది' అని భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల పరకామణి చోరీ కేసుపై ఆనాడే ఎందుకు చర్యలు తీసుకోలేదని నాటి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపై బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై జరుగుతున్న ఆరోపణలు, హుండీ కానుకలపై కుట్రలను ఆయన తీవ్రంగా ఖండించారు. పరకామణిలో 2025 జనవరిలో జరిగిన చోరీ చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగిని అప్పుడే అరెస్టు చేసి, కేసులు నమోదు చేసి, బంగారం రికవరీ కూడా చేశారని భాను ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ రోజు సాక్షి పత్రికలోనూ ఈ వార్త ప్రచురితమైందని తెలిపారు. అయితే ఇప్పుడు దాన్ని కొత్తగా జరిగినట్టు పెద్ద అక్షరాల్లో వార్తలు రాయడం వెనుక తిరుమల హుండీకి కానుకలు రాకుండా చేసే కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. 2023, జూన్ 13న భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ బోర్డు ఛైర్మన్‌గా ఉన్నప్పుడు శివశంకర్ అనే విజిలెన్స్ అధికారి.. భక్తుల నుంచి దొంగతనం చేసిన దొంగను ఆలయంలో పట్టుకున్నారని తెలిపారు. ఆ దొంగ నుంచి శివశంకర్ డబ్బులు కొట్టేశారని భాను ప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. అతన్ని ప్యారెంట్ డిపార్ట్‌మెంట్‌కు పంపి కరుణాకర్ రెడ్డి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. రవికుమార్ ఇష్యూలో సాక్ష్యాలను తారుమారు చేయడంలో శివశంకర్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. హుండీలో దొంగతనం చేసిన రవికుమార్‌తో చెట్టుకింద పంచాయితీ చేసి భాగాలు పంచుకున్నారని వ్యాఖ్యలు చేశారు. టీటీడీలో అవినీతి జరగలేదని తడిబట్టలతో తాను కాణిపాకంలో ప్రమాణం చేస్తానని.. కమిషన్లు తీసుకోలేదని ప్రమాణం చేస్తావా? అని భూమన కరుణాకర్‌రెడ్డికి సవాల్ విసిరారు. తన పార్టీకి తాను ఏమిటో తెలుసన్నారు. నెయ్యి కొరత ఉందని తిరుమలను టార్గెట్ చేసి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వారు ప్రింట్ చేసిన భగవద్గీత ముందు మాటలో 'మాట తప్పని.. మడమ తిప్పని' అని రాసుకున్నారని.. కానీ కంటెంట్ లేని లక్షల పుస్తకాలు గోదాముల్లో పడి ఉన్నాయని సెటైర్ విసిరారు. టీటీడీపై చేసే రాజకీయ ఆరోపణలకు టీటీడీ ఈవో సమాధానం చెప్పాల్సిన పని లేదన్నారు. టీటీడీకి ఉన్న క్రెడిబిలిటీని దెబ్బతీయడానికి తాడేపల్లి ప్యాలెస్ అనకొండలను వదులుతోందని ఆరోపించారు. తిరుమలలో ఆదిశేషుడు ఉన్నారని.. వారి ముందు ఈ అనకొండలు ఏమీ చేయలేవని భాను ప్రకాశ్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతేడాది జనవరి 11న పరకామణిలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెంచలయ్య 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను అపహరించేందుకు యత్నించినప్పుడు తితిదే విజిలెన్స్, సెక్యూరిటీ అప్రమత్తంగా వ్యవహరించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు చెప్పింది. ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలను కూడా కోర్టుకు సమర్పించినట్లు తెలిపింది. ఈ ఘటనను వక్రీకరించి పరకామణిలో భారీ స్థాయిలో బంగారం దొంగతనం జరిగినట్లు, రూ.కోట్ల విలువైన బంగారం మాయమైనట్లు ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని ప్రకటనలో పేర్కొంది.

# 17న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన టిటిడి





**తిరుమల,మార్చి11(ఆర్ఎన్ఎ):** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది ఉత్సవాలకు ముందు మంగళవారం కోయిల ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆపవాయితీగా వస్తోంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ కారణంగా 18వ తేది విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరని టిటిడి తెలిపింది.

# ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి.... కడియం, దానంలకు క్లీన్‌చిట్‌పై కెటిఆర్

**హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ):** పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి శాసనసభాపతి ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. ఇది కేవలం ఒక తీర్పు కాదు.. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను ఉపయోగించే ఉదాహరణ అని పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయన్నారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్‌చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని కేటీఆర్ అభివర్ణించారు. ఇది కేవలం తీర్పు కాదు.. అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థను ఉపయోగించే ఉదాహరణ అన్నారు.

# టీస్టాల్ తొలగింపుతో రోడ్డున పడ్డ కుటుంబం

**జనగామ,మార్చి11(ఆర్ఎన్ఎ):** జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వివాదాస్పద నిర్ణయంతో ఓ నిరుపేద దళిత కుటుంబం రోడ్డున పడింది. వివరాల్లోకి వెళ్తే..ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన వనిత టీ స్టాల్,(÷ఎజీనితిబిరజీ బి।జీ బబిజ్గీ÷) మిల్క్ పార్లర్‌ను జిల్లా కలెక్టరేట్ ఎదురుగా పూర్వ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. కాగా, దీనిని తొలగించాలంటూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలు జారీ చేయడంతో వనిత టీ స్టాల్‌ను మున్సిపల్ అధికారులు తొలగించారు. సీపీఎం నాయకులు అడ్డుపడినప్పటికి అధికారులు అక్కడ నంచి టీస్టాల్‌ను తొలగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# అంబేడ్కర్ రాజ్యాంగం కాదు..కాంగ్రెస్ రాజ్యాంగం

### స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ):** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేయడంపై బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పందించారు. స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది అంబేద్కర్ రాజ్యాంగం కాదు.. కాంగ్రెస్ రాజ్యాంగమని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ద్వంద్వ నీతికి స్పీకర్ తీర్పు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పును కాలరాసి కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ టికెట్ మీద ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్, కూతుర్ని కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయించి, కండువా వేసుకుని తిరిగి చేతి గుర్తుకు ఓటేయమని కోరిన కడియం శ్రీహరికి క్లీన్‌చిట్ ఇవ్వడం కాంగ్రెస్ మార్క్ రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. నిత్యం రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలును గాలికి వదిలేయడమే కాదు.. రాజ్యాంగాన్ని కూడా గాలికి వదిలేశాడని నిరంజన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ నిధుల దోపిడీకి ఇక్కడ అధికారాన్ని అడ్డుపెట్టుకున్నారు అనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని అన్నారు. అందుకే ఇక్కడి పరిణామాలపై, ఇక్కడి ప్రభుత్వ అరాచకాలపై కాంగ్రెస్ అధిష్ఠానం నోరెత్తడం లేదని విమర్శించారు.

# ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం... 15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం




**లాస్ ఏంజిల్స్,మార్చి11(ఆర్ఎన్ఎ):** ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్ కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగ్రశ్రేణి హాలీవుడ్ తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు.98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

# వలస పక్షులు.. కుశలమేనా..







పక్షుల కిలకిల రావాలు.. కుహూకుహూ రాగాలతో.. తెల్లవారు జామున మేల్కొలుపు.. సాయం సమయానికి పనిచేసి అలసిన శరీరాలకు ఆనందాన్నిచ్చే గానలహరి.. ఇలా ఎన్నో ఆనందాలు.. తనివి తీరని అనుభూతులు. పక్షి కూత.. పక్షి రాక మనిషి జీవన గమనంలో ఒక విడదీయరాని బంధమని చెప్పవచ్చు. అలా మనతో బంధాన్ని పెనవేసుకుని.. మనతో గడిపిన పక్షులు శీతాకాలం వచ్చేసరికి కనిపించకపోతే..! మరికొన్ని సమయాల్లో కనుమరుగైతే..! ఏమయ్యాయి? ఎటుపోయాయి? అనే ప్రశ్నలు వెంటాడతాయి కదా! అదే జరిగింది.. ప్రపంచ ప్రజల్లో కొన్ని శతాబ్దాల పాటు. ఆ ప్రశ్నలే అనేక విశేషాలు, విషయాలను మన ముందుంచాయి. ఈ నెల 14న 'ప్రపంచ వలస పక్షుల దినోత్సవం' సందర్భంగా కొన్ని ఆసక్తికర విషయాలతో ప్రత్యేక కథనం.

అది శీతాకాలమా.. వసంతకాలమా.. శరదృతువా.. అనే విషయాన్ని అలా ఉంచితే.. పక్షుల వలస సంగతులు చాలా ఆసక్తిని కలిగిస్తాయి. పక్షుల వలస గురించి శాస్త్రవేత్తల్లో ఆసక్తికరమైన మీమాంస బయలుదేరింది. ఆయా పరిశోధనల్లో ప్రపంచంలో దాదాపు 4,000 పక్షి జాతులు వలస పోతాయని తేలింది. మరో విశేషమేమంటే అసలు వలస వెళ్లని పక్షుల కంటే, చిన్న వయసులోనే వలస వెళ్ళే పక్షులు ఎక్కువకాలం జీవిస్తాయని పరిశోధనల్లో రుజువైంది.

**ఎందుకు పోతాయి.. :** చిన్న ప్రాణి.. చిరు ప్రాయం.. వలసపోయేంత అవసరం ఏముంది అనుకుంటున్నారా.. అదేనండి కూడు, గూడు.. మరికొన్ని అవసరాలు.. అంటున్నారు పరిశోధకులు. అవి నివసించే ప్రదేశంలో ఆహార వనరులు తగ్గినప్పుడు మెరుగైన ప్రదేశానికి వలస వెళతాయి. గూడు కట్టుకోడానికి అనుకూలమైన ప్రదేశాన్ని వెతుక్కుంటూ వలస వెళతాయి. వాతావరణ మార్పులు తీవ్రంగా ఉన్నప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు జరిగే ముందు, సంతానోత్పత్తిని పదిలపరచుకోవడానికి వలస మార్గం పడతాయని పరిశోధకులు అంటున్నారు.

**ఎలా వెళ్ళగలవు.. :** భూమి, సూర్యుడు, నక్షత్రాలే వీటి ప్రయాణానికి దిశా నిర్దేశాలు. సూర్యోదయం, సూర్యాస్తమయం, వలస మార్గంలో పగటిపూట కనిపించే ల్యాండ్‌మార్క్‌లు వాటికి సమాచార సూచికలు. వాటిలో ఉండే జీవగడియారం ద్వారా భూ అయస్కాంత క్షేత్రాన్ని గ్రహిస్తాయి. ధ్రువాలవైపు మార్గాలను అయస్కాంత క్షేత్ర సహాయంతోనే తెలుసుకుంటాయి.

**ఒకే మార్గంలో ఎలా ? :** హంసలు, బాతులు లాంటి పక్షులు తమ బృందంలోని పెద్ద పక్షులను అనుసరిస్తుంటాయి. కానీ, కొన్ని చిన్న పక్షులు ఎలాంటి మార్గనిర్దేశం లేకుండా స్వయంగానే వలస మొదలుపెడతాయి. సబ్-సహారన్ లాంటి పక్షులు మొదటిసారి వలస వెళ్ళేటప్పుడే వాటంతట అవే వెళ్ళి, స్వప్రదేశాలకు క్షేమంగా తిరిగి వస్తాయి. చాలా చిన్నదిగాకనిపించే సాంగ్‌బర్డ్.. అలస్కా నుంచి ఆఫ్రికా వరకు (15 వేల కి.మీ) వలస వెళ్లి, అదే ఏడాది తమ స్వస్థలానికి తిరిగి వస్తాయి. కచ్చితంగా అదే ప్రాంతానికి పక్షులు వెళ్లటంగానీ, తిరిగి రావటంగానీ ఎలా చేయగలుగుతున్నాయి..? అనే ప్రశ్న తలెత్తినప్పుడు జీవ గడియారం సహాయంతో అని అధ్యయనాల్లో తేలింది.

**జీవ గడియారం అంటే..! :** పక్షుల శరీరంలో జీవగడియారం ఉంటుంది. ఇది సూర్యోదయం.. సూర్యాస్తమయ సమయాలను ముందుగానే గుర్తిస్తుంది. శరీరంలోని కణాలతో ప్రోటీన్ అణువులు సంఘర్షణ చెంది, శక్తిని విడుదల చేయడంలో ఉపకరిస్తుంది. రోజు మొత్తంలో అంటే ఇరవై నాలుగు గంటల్లో శారీరకంగా, మానసికంగా జరిగే మార్పులపై జీవ గడియారం ప్రభావం ఉంటుంది. ఇది సహజ సమయ పరికరమని చెప్పవచ్చు. జీవ గడియారం గురుత్వాకర్షణ శక్తి ప్రభావాలను గుర్తిస్తుంది. గ్రావిటేషన్ మార్పులకు అనుగుణంగా యాంత్రిక గడియారాలను ప్రేరేపిస్తుంది. గురుత్వాకర్షణ శక్తి పెరిగినప్పుడు అవి నెమ్మదించేలా.. బలహీనమైనప్పుడు వేగవంతం చేసేలా క్రమబద్ధీకరిస్తుంది. అంతేకాదు.. మేల్కొనడం దగ్గర నుంచి ప్రతి ప్రక్రియనూ నియంత్రణలో ఉంచుతుంది. అలాగే సంతానోత్పత్తి, వలసలను కాలానుగుణంగా నిర్ణయించి, పక్షులు వలస వెళ్లడానికి సంకేతాన్నిస్తుంది ఈ జీవ గడియారం. ఆహా ఇలాంటిదేదో మనకీ ఉంటే బాగుండు అనిపిస్తుంది కదూ.. ప్రతి జీవిలోనూ.. అంటే మనలో కూడా జీవ గడియారం ఉంటుందటండోరు. అయితే మనమే దానిని గుర్తించక, జీవన సరళిని మన అవసరాలకు అనుగుణంగా మార్చేసుకుంటున్నాం. ప్చ్.. ఆధునికం..!

**శారీరకంగా సన్నద్ధం.. :** వలసకు వెళ్లడానికి ముందే పక్షులు శారీరకంగా సిద్ధమవుతాయి. ప్రయాణానికి ముందు ఎక్కువ ఆహారాన్ని తీసుకుంటాయి. దీంతో కాలేయం, ప్రత్యుత్పత్తి అవయవాల పరిమాణం తగ్గుతుంది. ఆక్సిజన్, కొవ్వులను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకునేలా శరీరంలో మార్పులు జరుగుతాయి. కొన్ని పక్షుల్లో వలసకు ముందు కొత్త ఈకలు వస్తాయి. ఇలా దాదాపు నెలరోజుల్లో వలసకు శరీరం కూడా సిద్ధపడుతుంది. ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది అత్యంత సహజం పక్షుల్లో జరిగే పరిణామక్రమం.

**వీటిల్లో రకాలెన్నో.. :** అవును.. రెండు రకాలుగా చెబుతున్నారు. ఏటా ఒకే సమయంలో వలసకు వెళ్లేవి కొన్ని..

వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వెళ్ళేవి మరికొన్ని. ఆసియాలోని బోర్నియోలో బ్రౌన్‌ష్రైక్ కాలమాన వలస పక్షికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ పక్షుల రాక సమయాన్ని ఆధారం చేసుకుని

రైతులు పంటలు వేస్తారంటే నమ్మశక్యమేనా..?! కానీ ఇది నిజం. ష్రైక్ రాకనుబట్టే అక్కడి రైతులు పంట సమయాన్ని నిర్ణయించుకుంటారు. అంటే ఆ పక్షి రాక అంత కచ్చితంగా ఉంటుందన్న మాట.

**ఒకే జాతి.. దారులు వేరు.. :** ఒకే జాతి పక్షులు వేర్వేరు దారుల్లో ప్రయాణిస్తాయి కొన్నిసార్లు. కెనడాలోని నార్తెర్న్ వీటర్స్.. ఇలా వేరే మార్గాల్లో ప్రయాణిస్తాయి. ఇవి ఎక్కువగా సముద్రంపై నుంచే ప్రయాణిస్తాయి.

**ప్రయాణంలో ప్రమాదాలా.. ! :** ఎక్కువ దూరం వలస వెళ్లడం ప్రమాదకరమే. కొత్త వాతావరణానికి అలవాటు పడటం, వ్యాధుల బారిన పడటం, వేటకు గురికావడం.. ఇలా చాలా ముప్పులు పక్షులను వెంటాడుతుంటాయి. చిన్న వయసు పక్షులకు మరింత ప్రమాదకరం. వలస మరణాల్లో 80 శాతం చిన్న పక్షులే ఉంటాయని తేలింది.

అంతేకాదు పక్షులు వలస ప్రయాణంలో వాసన చూసే శక్తిని కోల్పోతే.. వలస మార్గాన్ని కనిపెట్టలేవు. హెూమింగ్ పీజియన్స్, మరికొన్ని పక్షులలోనూ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంటుందని అధ్యయనాల్లో రుజువైంది.

**మన దేశంలో.. :** ఆంధ్రప్రదేశ్‌లో కొల్లేరు, కోరింగ, పులికాట్ సరస్సులు.. రాజస్థాన్‌లోని భరత్‌పూర్, ఒడిశాలోని చిలికా సరస్సులు వీటికి కేంద్రాలు. అలాగే కేరళలోని కుమరకోమ్, గుజరాత్‌లోని లిటిల్ రాన్ ఆఫ్ కచ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని ఈగల్నెస్ట్ కూడా. ఇంకా గుజరాత్‌లోని నల్సరోవర్, కర్ణాటకలోని రంగనాతిత్తు పక్షి అభయారణ్యాలు మన దేశంలో సందర్శన ప్రదేశాలు.

**బంధించిన పక్షుల్లో వింత ప్రవర్తన.. :** స్వేచ్ఛగా విహరించే పక్షులను పంజరాల్లో బంధించి మనం ఆనందం పొందుతూంటాం. కానీ శీతాకాలం వలస సమయం ఆసన్నమయ్యేసరికి పంజరంలో బంధించిన (పెంపుడు) పక్షులు వింతగా ప్రవర్తిస్తాయని శాస్త్రవేత్తలు గమనించారు. బరువు పెరగడం, విశ్రాంతి లేనట్లు చికాకుగా కనిపిస్తాయి. అలాగే రాత్రిపూట అధికంగా చురుగ్గా వ్యవహరిస్తాయి. బోనును పదేపదే గోర్లతో గీకడం.. లాంటి సంకేతాలు ఈ పక్షుల్లో కనిపించాయని వారంటున్నారు.



# పారదర్శక సేవలే లక్ష్యం

## భూముల రీ-సర్వే కోసం ఆధునిక 'రోవర్ల' కొనుగోలు... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో బ్జడెట్ సన్నాహక సమావేశం

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో భూ లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించి, ప్రజలకు ముఖ్యంగా రైతులకు అత్యుత్తమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన 2026-27 బడ్జెట్ సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖలకు సంబంధించిన బ్జడెట్ ప్రతిపాదనలను సమర్పిస్తూ మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు: భూ సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని



నివారించడానికి రెవెన్యూ, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, అత్యాధునిక 'రోవర్' పరికరాలతో భూముల సర్వే నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇప్పటికే మండలానికి ఒకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేశామని తెలిపారు. వచ్చే బ్జడెట్‌లో మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో నక్షా (మ్యాప్) లేని 373 గ్రామాల్లో త్వరలోనే రీ-సర్వే చేపట్టబోతున్నామని, ఇందుకు సంబంధించి 2026-27 బ్జడెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రిని కోరారు. తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత ప్రభుత్వ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా పరిపాలన సౌలభ్యం కోసం వీటికి అవసరమైన బ్జడెట్ కేటాయింపులు జరపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రెవెన్యూ మరియు ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొని శాఖల వారీగా నిధుల అవసరాలపై చర్చించారు.

# 12న సర్పంచులు, చైర్మన్లు, మేయర్లకు శిక్షణ

## ప్రజాపాలనపై ప్రతినిధులకు అవగాహన... జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలి కాన్ఫరెన్స్

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించ నున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు , 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశించారు. జూన్ 12వ తేదీ వరకు నిర్వహించే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈనెల 12న కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంపై నేడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ,



ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వచ్చి ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే ఉటంకిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఏవిధంగా నైతే ప్రామాణికమైన ఫలితాలు అందుతాయో, ఆ కోణంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఎ÷-లాగ్ షిప్ కార్యక్రమాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు , ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగేలా ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12,700 గ్రామా పంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలున్నాయని, వీటన్నింటిలో 15000 మంది ప్రజాప్రతినిధులున్నారని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎం.పీ లు , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లను కూడా ఆహ్వానించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. జిల్లా లోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలిపే ఫోటో ప్రదర్శనను కూడా వేదిక వద్ద ఏర్పాటు చేయాలన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు ÷ల్లై క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను రామకృష్ణా రావు అభినందించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈసందర్భంగా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, తమ విధులు బాధ్యతలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సర్పంచుల పాత్ర తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించాలన్నారు. మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె శ్రీదేవి మాట్లాడుతూ, సిటిజెన్ చార్టర్, మున్సిపల్ చట్టాలు, ఎ÷-లాగ్ షిప్ ప్రోగ్రాం, అమృత్ తదితర కార్యక్రమాలపై మున్సిపల్ ప్రజాప్రతినిధు లకు అవగాహన కల్పించాలన్నారు. సెర్ప్ సి.ఈ.ఓ దివ్య మాట్లాడుతూ, ఈనెల 12న ఏర్పాటు చేసే శిక్షణ కార్యక్రమానికి సంబంధించి సవివరమైన ట్రైనింగ్ మాడ్యూల్ ను ఇప్పటికే కలెక్టర్లకు పంపామని తెలిపారు.

# 9 నుంచి 'డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవాలు'

న్యూఢిల్లీ, మార్చి 11 (పిఐబి): భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) తన "హర్ పేమెంట్ డిజిటల్" మిషన్‌లో భాగంగా, 2026 మార్చి 9 నుంచి మార్చి 15 వరకు 'డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవాలను' నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం "సురక్షితమైన డిజిటల్ చెల్లింపులు" అనే థీమ్‌తో, "థోడా ధ్యాన్ సే" (కాస్త జాగ్రత్తగా) అనే సందేశంతో దేశవ్యాప్తంగా డిజిటల్ లావాదేవీలను సురక్షితంగా, విస్తృతంగా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.

**ముఖ్యమైన అంశాలు**

భద్రతకే ప్రథమ ప్రాధాన్యత: డబ్బు పొందేందుకు ఎప్పుడూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయవద్దు లేదా పిన్ ఎంటర్ చేయవద్దు. క్రెడెన్షియల్స్ గోప్యత: పిన్ లేదా ఓటిపి ని ఎవరితోనూ పంచుకోవద్దు. ఇది మీ డిజిటల్ సంతకం వంటిది. నమ్మశక్యం కాని ఆఫర్లు: నమ్మలేనంత గొప్పగా అనిపించే ఆఫర్లను ఎప్పుడూ నమ్మవద్దు. తనిఖీ చేయడం అలవాటుగా మార్చుకోండి: డబ్బు పంపే ముందు గ్రహీత పేరు, నగదు మొత్తం, ఇతర వివరాలను ఒకటికి రెండుసార్లు తనిఖీ చేయకుండా పంపవద్దు.

**ప్రధాన సందేశం:**

సురక్షితమైన డిజిటల్ లావాదేవీల గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ "డిజిటల్ పేమెంట్ మిత్ర"గా మారాలని ఈ ప్రచారం ప్రోత్సహిస్తోంది.

# బాసర నుంచి భద్రాచలం వరకు అభివృద్ధికి ప్రణాళికలు

## గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మార్చి 11 (ఆర్ఎన్ఎ): వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని ప్రధాన ఆలయాలు, పురాతన ఆలయాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన గోదావరి పుష్కరాల కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి సమగ్ర రోడ్ల అనుసంధానం కల్పించే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే విధంగా ఒక సమగ్ర మాస్టర్ ఎ÷-లాన్ రూపొందించాలని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన చోట రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కోసం ఎంత మేర నిధులు అవసరమో ఆర్థిక పరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బాసర, భద్రాచలం, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలే కాకుండా మధ్యలో ఉన్న ఇతర ప్రముఖ దేవాలయాలకు కూడా సౌకర్యవంతమైన రోడ్ల కనెక్టివిటీ కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రణాళిక రూపొందించాలని మంత్రి తెలిపారు. ప్రధాన రహదారులతో దేవాలయాలను అనుసంధానం చేస్తూ ఒకేసారి సమగ్ర ప్రణాళిక అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. బాసర దేవాలయానికి ఇప్పటికే మాస్టర్ ఎ÷-లాన్ ఆమోదం ఉన్నందున, భద్రాచలం దేవస్థానం మాస్టర్ ఎ÷-లాన్ ను కూడా ఈ కమిటీలో చర్చించి ముఖ్యమంత్రి గారి ఆమోదం తీసుకోవాలని అన్నారు.

# ఎప్రిల్ 2,3 తేదీల్లో టెక్స్టైల్ కాన్ఫరెన్స్... బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు

హైదరాబాద్,మార్చి11(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో జరగనున్న 13వ ఆసియన్ టెక్స్టైల్ కాన్ఫరెన్స్ కు సంబంధించిన బ్రోచర్‌ను రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ,దుద్దిళ్ల శ్రీధర్ బాబులు కలసి విడుదల చేశారు. సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, తెలంగాణను దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో టెక్స్టైల్ రంగంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే



సదస్సు ద్వారా దేశీయ-అంతర్జాతీయ టెక్స్టైల్ పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, నిపుణులు ఒకే వేదికపైకి రావడం ద్వారా తెలంగాణలో టెక్స్టైల్ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్ 2 మరియు 3 తేదీల్లో హైదరాబాద్‌లో లో నిర్వహించనుంది. మావేశంలో టెక్స్టైల్ రంగంలో సస్టైనబిలిటీ, సాంకేతికత, సరఫరా వ్యవస్థల అభివృద్ధి, గ్లోబల్ మార్కెట్ల అవకాశాలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అదనంగా, ఏప్రిల్ 4న వరంగల్‌లోని పరిశ్రమల సందర్శన కూడా నిర్వహించనున్నారు. సమావేశం ద్వారా తెలంగాణను టెక్స్టైల్, అపారెల్ మరియు ఫుట్‌వేర్ తయారీకి అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలియజేశారు.

## కారు--ఆటో ఢీ.. డ్రైవర్‌కు గాయాలు...



**నందిగామ మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వత్సవాయి మండలం దేచుపాలెం గ్రామం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ వడ్డెంపూడి ఉపేంద్ర గాయపడ్డాడు. ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో పరస్పరం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఆటో తీవ్రంగా దెబ్బతినగా డ్రైవర్ ఉపేంద్రకు గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు దేచుపాలెం గ్రామానికి చెందిన ఒక ప్రముఖుడిదిగా తెలుస్తోంది. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో రాకపోకలు అంతరాయం కలిగాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## అభివృద్ధి కార్యక్రమాలపై తిరువూరు ఎమ్మెల్యే సమీక్ష...



**నందిగామ మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీఓలు, ఏపీవోలతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల్లో అమలు అవుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు వివరించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచినీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే డ్రైనేజీల పూడికతీత పనులను వేగవంతం చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా అమలు చేసి అర్హులైన కార్మికులకు ఉపాధి కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడలో కుటుంబ కలహం...

### మెట్లపై నుంచి తోసివేత, మహిళ మృతి...



**నందిగామ మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుడివాడలోని బాపూజీ నగర్‌లో మంగళవారం జరిగిన కుటుంబ కలహం విషాదానికి దారి తీసింది. నర్మద అనే మహిళ తన కుటుంబ సభ్యులతో జరిగిన గొడవలో తన భర్త నాయనమ్మ అయిన ఆగ్నేసమ్మను మెట్లపై నుంచి తోసివేయడంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మెట్లపై పడడంతో ఆగ్నేసమ్మ తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం ఎక్కువగా జరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స కోసం విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికంగా విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## గంపలగూడెం మండలంలోని రేషన్ బియ్యం అక్రమ నిల్వలు బట్టబయలు...

### 150 రేషన్ బియ్యం క్వింటాళ్లు స్వాధీనం...



**నందిగామ మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గంపలగూడెం మండలంలోని దుందిరాలపాడు గ్రామంలో ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్)కు చెందిన రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన ఘటనను అధికారులు మంగళవారం వెలికితీశారు. తునికిపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని వెంకటేశ్వరరావు తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, కోళ్లకు మేతగా వినియోగించేందుకు పొలంలో నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ వి.రాజాకుమారి, ఎస్సై జి.అనిల్, పీడీఎస్ డిప్యూటీ తహసీల్దార్ శివ నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ నిల్వ ఉంచిన సుమారు 150 క్వింటాళ్ల బియ్యం ఉన్న 300 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కొమ్మినేని వెంకటేశ్వరరావుపై 6ఏ, క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# "పది" విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

**పదవ తరగతి విద్యార్థులు బస్సు పాస్ లేకపోయినా,**
**హాల్ టికెట్ తో ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయొచ్చు.**
**ఏపీఎస్‌ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి.**




**మచిలీపట్నం మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పదవ తరగతి విద్యార్థులు ఏ విధమైన బస్సు పాసు లేనప్పటికీ హాల్ టికెట్ చూపించి వారు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయవచ్చని ఏపీఎస్‌ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి ఒక ప్రకటనలో తెలియజేశారు. 16.03.2026 నుండి 01.04.2026 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు-2026 నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం ఏపిఎస్‌ఆర్టీసి ప్రత్యేక ఏర్పాట్లు చేయుచున్నదన్నారు. విద్యార్థులు తమ నివాస ప్రాంతం నుండి పరీక్షా కేంద్రము వరకు తిరిగి పరీక్ష ముగిసిన అనంతరం పరీక్షా కేంద్రము నుండి వారి నివాస ప్రాంతము వరకు పరీక్షా సమయాలలో ఏ విధమైన బస్ పాస్ లేనప్పటికీ, వేరే రూట్ బస్ పాస్ కలిగి ఉన్నప్పటికి, విద్యార్థులు కేవలం హాల్ టిక్కెట్ చూపించి ఎటువంటి ఛార్జీలు లేకుండా అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసులలో ఉచితంగా ప్రయాణించేలా జిల్లా పరిధిలోని అన్ని డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసామన్నారు. పదవ తరగతి పరీక్షలు జరిగే దినములలో మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యము అనుమతించబడుతుందన్నారు. పరీక్షలు ఉన్న రోజులలో ప్రభుత్వ సెలవు దినము అయినప్పటికీ ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తాం అన్నారు. కృష్ణా జిల్లా పరిధిలోని అన్ని డిపోల పరిధిలో సిబ్బందికి అవగాహన కల్పించుటకు గేట్ మీటింగ్స్ ద్వారా, నోటీసు బోర్డుల ద్వారా తెలియజేయాలని సంబంధిత డిపో మేనేజర్లకు తగు సూచనలు చేశామన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాయుచున్న విద్యార్థులు ఈ విషయమును గమనించి, ఏపిఎస్ ఆర్టీసి వారు కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యమును వినియోగించుకోవలసిందిగా కోరారు. పదవ తరగతి పరీక్షలు వ్రాయబోతున్న విద్యార్థులందరూ పరీక్షలలో బాగా రాణించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## మొంతా తుఫాను పై లోక్ సభలో ప్రశ్నించిన ఎంపి బాలశౌరి



**మచిలీపట్నం మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పార్లమెంట్ సమావేశాలలో కేంద్ర గృహ వ్యవహారాల మంత్రిని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మంతా తుఫాను నాటి పరిస్థితులపై తీసుకున్న చర్యలపై ప్రశ్నించారు.
(ఎ) ఇటీవల మొంతా తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుభవించిన నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసిందా?
(బి) వ్యవసాయం, రోడ్లు భవనాలు,జల రంగం, విద్యుత్, నీటిపారుదల మొదలైన వాటికి జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం తన కేంద్ర బృందాన్ని పంపిందా?
(సి) కేంద్ర బృందం తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందా?
(డి) బృందం చేసిన సిఫార్సులపై ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు.
బాలసౌరి మాట్లాడుతూ కేంద్ర గృహ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిత్యానంద్ రాయ్ వ్రాత పూర్వక సమాధానం ఇచ్చారన్నారు.
(ఎ) నుండి (డి): జాతీయ విపత్తు నిర్వహణ విధానం (ఎన్‌పిడిఎం) ప్రకారం, విపత్తు నిర్వహణకు ప్రాథమిక బాధ్యత, క్షేత్ర స్థాయిలో నష్టాలను అంచనా వేయడంతో సహా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్‌ఎఫ్) నుండి, భారత ప్రభుత్వం ఆమోదించిన అంశాలకు అనుగుణంగా సహాయ చర్యలు తీసుకుంటాయన్నారు .నిబంధనలు కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వాల ప్రయత్నాలకు మద్దతు ఇస్తుందన్నారు. అవసరమైన లాజిస్టిక్స్ ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు.
'తీవ్రమైన ప్రకృతి' విపత్తు సంభవించినప్పుడు, నిర్దేశించిన విధానం ప్రకారం,జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్ డి ఆర్ ఎఫ్) నుండి అదనపు ఆర్థిక సహాయం అందించబడుతుందన్నారు. ఇందులో అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందం (ఐ ఎం సి టి)సందర్శన ఆధారంగా అంచనా వేయబడుతుందన్నారు. 2025లో ఆంధ్రప్రదేశ్‌లో 'మొంతా' తుఫాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి మెమోరాండం కోసం వేచి ఉండకుండా, నష్టాలను అక్కడికక్కడే అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం ఐ ఎం సి టి ని ఏర్పాటు చేసిందన్నారు.
2025 నవంబర్ 10 నుండి 11 వరకు ఐ ఎం సి టి రాష్ట్రంలోని ప్రభావిత ప్రాంతాలను సందర్శించిందన్నారు. ఐ ఎం సి టి నివేదిక ఆధారంగా ఎన్ డి ఆర్ ఎఫ్ నుండి అదనపు ఆర్థిక సహాయం పరిగణించబడుతుందని మంత్రి తెలిపారని బాలశౌరి తెలియజేశారు.


## మైలవరం దేవుని చెరువులోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల ఆగ్రహం...

- అధికారులు స్పందించాలంటున్న తల్లిదండ్రులు
- ఉడకని అన్నం.. నాసిరకం కూరలు
- మధ్యాహ్న భోజనంతో పిల్లలకు కడుపునొప్పి



**నందిగామ మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మైలవరం దేవుని చెరువులోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నం సరిగా ఉడకడం లేదని, కూరలు నాణ్యతగా లేవని మంగళవారం విద్యార్థులు ఆరోపించారు. పాఠశాలలో అందిస్తున్న భోజనం తినడంతో ఇంటికి వెళ్లిన తర్వాత కొంతమంది పిల్లలు కడుపునొప్పితో బాధపడుతున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను వెంటనే పరిశీలించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పౌర సేవల ప్రజాభిప్రాయంలో పల్నాడు కు రెండవ స్థానం




**నరసరావు పేట మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పౌర సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో పల్నాడు జిల్లాకు రెండవ స్థానం లభించిందని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఆర్టీసీ బస్సు ప్రయాణం, విత్తన పంపిణీ, వైద్య సేవలు, మహిళలపై నేరాల నివారణ వంటి 39 రకాల సేవలపై చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా రెండవ స్థానం సాధించింది. డిసెంబరు నెలతో పోలిస్తే 68.1 శాతం ఉన్న ప్రజల సంతృప్త స్థాయి 5.4 పర్సంటేజీ పాయింట్లు వృద్ధి సాధించి 73.50 శాతానికి పెరిగిందన్నారు.

## పిడుగుపాటు బాధిత కుటుంబాలకు రూ.4 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా



**ఆమదాలవలస గ్రామీణం మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆమదాలవలస నియోజకవర్గంలో 2022-23 కాలంలో పిడుగుపాటు ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున 'నేచురల్ కలామిటీస్ - థండర్ బోల్ట్ డెత్ ఎక్స్‌గ్రేషియా' పేరుతో పరిహారాన్ని ప్రకటించింది. బూర్జ మండలానికి చెందిన చోడవరపు వెంకట సత్యనారాయణ, సరుబుజ్జిలి మండలానికి చెందిన బురాడ అప్పలనాయుడు, దాసరి అప్పన్న కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించింది. ఈ మేరకు బాధిత కుటుంబాలకు.. ఎమ్మెల్యే కూన రవికుమార్ పరిహారానికి సంబంధించిన పత్రాలను అందించారు. బాధిత కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా పరిహారం జమ అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. తమకు ఆర్థికంగా సాయం చేసినందుకు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపాయి.

## పేద కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే



**ఆదోని మార్కెట్ మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదోని నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.7.63 లక్షల చెక్కులను 12 బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి బుధవారం పంపిణీ చేశారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటోందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళుతోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు శివప్ప, కూటమి నాయకుల బుద్ధారెడ్డి, వార్డు కౌన్సిలర్లు సురేష్, చిన్న, చంద్ర, ఉపేంద్ర, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలి: మాజీ ఎంపీ



**కర్నూలు మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని మాజీ ఎంపీ టీజీ.వెంకటేష్ అన్నారు. కర్నూల్‌లోని బంగారుపేట క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-5 పోటీలను ఎస్టీబీసీ కళాశాల మైదానంలో ఆయన ప్రారంభించారు. మూడు రాష్ట్రాల క్రీడాకారులతో క్రికెట్ పోటీలు ప్రతి ఏడాది నిర్వహించడం అభినందనీయం అన్నారు. క్రీడలకు తన వంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ పోటీల్లో మొత్తం 22 జట్లు పాల్గొంటాయని, 5 రోజుల పాటు ఈ పోటీలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

## ఆడపిల్లలు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేయించుకోవాలి: ఎమ్మెల్యే



**బుచ్చిరెడ్డిపాలెం మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రాఆకే)లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధి సోకిన తర్వాత చికిత్స కోసం ఇబ్బంది పడటం కంటే.. రాకుండా ముందుగానే నివారించుకోవడం ఉత్తమమైన పని అని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆడవాళ్లను ఇబ్బంది పెట్టే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఒక గొప్ప రక్షణ కవచమన్నారు. మార్చి 11వ తేదీ నుంచి మూడు నెలల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. 14 ఏళ్లు పూర్తయిన ఆడపిల్లలందరూ టీకా తీసుకోవడానికి అర్హులని తెలిపారు.

## జిల్లాలో రెండు రోజులు పాటు ఫుడ్ కమిషన్ మెంబర్ ఆకస్మిక తనిఖీలు





**పల్నాడు జిల్లా,మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నరసరావుపేటలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ బి.కాంతారావు మంగళవారం పర్యటించారు. స్థానికంగా రేషన్ షాపులు, అంగన్‌వాడి సెంటర్లు, జిల్లా పరిషత్ హై స్కూల్, కే.జీ.బీ.వీ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్ యార్డ్ దగ్గర ఉన్న రెండు రేషన్ షాపులు, మున్సిపల్ హై స్కూల్, పెద్ద చెరువు వద్ద రెండు అంగన్‌వాడీలు, కే.జీ.బీ.వీ వసతిగృహాలు, ఎం.జె.పి.డబ్ల్యూ.ఆర్ స్కూలు మరియు వసతి గృహాలను మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు తనిఖీ చేశారు. అంగన్‌వాడీల తనిఖీలో కోడిగుడ్లు, చికెన్ తక్కువగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, పోషకాహారం తక్కువగా ఉండటంపై సంబంధిత సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ అనేక సంస్కరణలు తెచ్చారని, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు తీసుకు వచ్చారన్నారు. మధ్యాహ్న పథకంలో కోడు గుడ్డుతో పాటు పిల్లలకు ఇష్టంగా తినేందుకు ఫ్రైడ్ రైస్ ఏర్పాటు చేయడం, పిల్లలకు అన్నిచోట్ల సన్న బియ్యం ఇవ్వడం గొప్ప విషయంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణతో పథకాల నిర్వహణ మెరుగుపరచొచ్చన్నారు. బుధవారం సత్తనపల్లి లో రేషన్ షాపులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు పల్నాడు జిల్లా డిప్యూటీ తాసిల్దార్ సునీత పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కెమెరామెన్ పేల్చిన 'విశ్వంభర' బాంబులు

విపరీతమైన ఆలస్యానికి గురై, అభిమానుల సహనాన్ని పరీక్షిస్తూ వచ్చిన విశ్వంభర విడుదల తేదీ ఇప్పటికీ ఖరారు కాలేదు. రెండు సంక్రాంతులు అయిపోయినా ఎలాంటి అప్డేట్ లేక ఫ్యాన్స్ నుంచి నిరసన గళం వినిపిస్తోంది. జాప్యానికి కారణం విజువల్ ఎఫెక్ట్స్ అన్నది అందరికీ తెలిసిన విషయమే అయినా తాజాగా జరిగిన ఒక ఈవెంట్ లో ఈ సినిమా కెమెరామెన్ ఛోటా కె నాయుడు చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. కంప్యూటర్ గ్రాఫిక్స్ ఎక్కువగా ఉండే సినిమాల్లో కెమెరామెన్ బాధ్యత తక్కువగా ఉంటుందని, దర్శకులు ఏం కోరుకుంటారో దాన్నే మేమిస్తామని, క్వాలిటీ సరిగా రాకపోతే దానికి ఛాయాగ్రాహకుడిని బాధ్యుణ్ణి చేయడం ఎంత మాత్రం సరికాదని వివరించారు. అంజికి తల ఎత్తుకుని పని చేసిన నేనే ఇప్పుడు విశ్వంభరకు తల వంచుకుని చేయాల్సి వస్తోందని, నాలుగు వందల కోట్ల బడ్జెట్ కాబట్టి నా మాటే చెల్లుబాటు కావాలనే ధోరణి ఇక్కడ పనికి రాదనీ చెప్పి కొత్త ట్విస్ట్ ఇచ్చారు. విశ్వంభర నిర్మాణంలో ఉన్న టైంలోనే చోటా వల్లే కొంత సమస్య వచ్చిందనే పుకారు ఫిలిం



నగర్ వర్గాల్లో చక్కర్లు కొట్టింది. దర్శకుడు వసిష్ఠ దాన్ని కొట్టేసినప్పటికీ గాసిప్పులు మాత్రం ఆగలేదు. పరోక్షంగా ఇవాళ చోటా కె నాయుడు దాని గురించి క్లారిటీ ఇచ్చినట్టే. బెస్ట్ అవుట్ పుట్ కోసం టీమ్ ఇంకా కష్టపడుతూనే ఉందని, తనవరకు చేయాల్సింది ఇంకేం లేదని కుండబద్దలు కొట్టారు. కాకపోతే తలవంచి పని చేయడమనే మాటే రకరకాల అర్థాలు తీస్తోంది. చోటా కె నాయుడు చెప్పిన ప్రకారం ఇలాంటి సిజి మూవీస్ కి కెమెరామెన్ తో పాటు ఒక స్పెషలిస్ట్ టెక్నీషియన్ ఉంటాడని, అతని అంగీకారం లేకుండా ఒక్క ఫ్రేమ్ కూడా ఓకే కాదని చెప్పిన ఇంకో ఝలక్ ఇచ్చారు. ఏది ఏమైనా ఇప్పుడీ టాపిక్ పుణ్యమాని విశ్వంభర మరోసారి వార్తల్లోకి వచ్చేసింది. చిరంజీవితో చూడాలని ఉంది, అంజి లాంటి ఎన్నో టాప్ నాచ్ బ్లాక్ బస్టర్స్ కు పని చేసిన ఛోటా కె నాయుడుకి విశ్వంభర విషయంలో ఇలాంటి అనుభవం ఎదురు కావడం విచిత్రం. వసిష్ఠ డెబ్యూ మూవీ బింబిసారకు ఛాయాగ్రహణం అందించింది కూడా ఛోటా కె నాయుడేనన్న విషయం ఇక్కడ మర్చిపోకూడదు.




## డైరెక్టర్ హైప్ ఇస్తుంటే... నాగ్ ఫ్యాన్స్‌కు టెన్షన్



టాలీవుడ్ సీనియర్ హీరో అక్కినేని నాగార్జున వరుసగా తమిళ నటులు, టెక్నీషియన్లతో పని చేస్తున్నాడు. గత ఏడాది ధనుష్‌తో కలిసి నాగ్ నటించిన కుబేర ఓ మోస్తరు ఫలితాన్ని అందుకుంది. కానీ సూపర్ స్టార్ రజినీకాంత్ సినిమా కూలీలో విలన్ పాత్ర పోషించిన నాగ్‌కు నిరాశ తప్పలేదు. ప్రి రిలీజ్ హైప్ వల్ల సినిమాకు ఓపెనింగ్స్ వచ్చాయి కానీ.. కంటెంట్ పరంగా కూలీ తీవ్ర నిరాశకు గురి చేసింది. నాగ్ పాత్ర విషయంలో ఎంతో ఊహించుకున్న అభిమానులకు తీవ్ర నిరాశ తప్పలేదు. ఈ సినిమాలో నాగ్ క్యారెక్టర్ గురించి రిలీజ్ ముంగిట దర్శకుడు లోకేష్ కనకరాజ్ మామూలు హైప్ ఇవ్వలేదు. చివరికి చూస్తే.. అంతన్నాడింతన్నాడే.. పాట గుర్తుకొచ్చింది నాగ్ క్యారెక్టర్ చూసి. తమిళ హీరోలు తెలుగు దర్శకుల వైపు చూస్తుంటే.. నాగ్ చిత్రంగా వరుసగా తన రెండో సినిమాను కూడా తమిళ దర్శకుడితోనే చేయడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. పైగా అది నాగ్ వందో సినిమా కావడం గమనార్హం. తమిళ యువ దర్శకుడైన రా.కార్తీక్.. నాగ్ మైల్ స్టోన్ మూవీని డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ సినిమా గురించి ఇప్పటిదాకా ఎక్కడా మాట్లాడని రా.కార్తీక్.. తొలిసారి తమిళ మీడియాతో మాట్లాడాడు. అతను నాగ్‌కు ఎలవేషన్ ఇచ్చాడు. నాగ్ వందో సినిమా చిత్రీకరణ ప్రస్తుతం నాన్‌స్టాప్‌గా జరుగుతోందని చెప్పిన కార్తీక్.. ఈ సినిమాలో నాగ్ సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తాడని చెప్పాడు. శివ, రక్షకుడు, కూలీ సినిమాల్లో ఎలా అయితే స్టైలిష్ అవతారంలో కనిపించాడో.. అంతే అందంగా ఈ సినిమాలోనూ ఉంటాడన్నాడు. ఈ సినిమాలో నాగ్ మల్టిపుల్ గెటప్స్‌లో కనిపిస్తాడని కూడా కార్తీక్ వెల్లడించాడు. వందో సినిమాకు తెలుగు దర్శకుడిని కాక, తమిళుడైన తననే ఎందుకు ఎంచుకున్నారని అడిగితే.. నీతో నాకు ఓకే అని నాగ్ చెప్పినట్లు కార్తీక్ తెలిపాడు. తన కెరీర్ ఆరంభంలోనే మణిరత్నం సార్‌తో గీతాంజలి చేసిన విషయాన్ని నాగ్ గుర్తు చేసినట్లు కార్తీక్ వెల్లడించాడు. నాగ్ గురించి కార్తీక్ ఇచ్చిన ఎలివేషన్ బాగుంది కానీ.. లోకేష్ కనకరాజ్‌లా విషయం తక్కువ బిల్డప్ ఎక్కువలా కాకుండా మంచి పాత్ర, సినిమాతో నాగ్ మైల్‌స్టోన్ మూవీని మెమొరబుల్‌గా మార్చాలని అక్కినేని అభిమానులు కోరుకుంటున్నారు.

# మహేష్ అభిమానులకు హరీష్ సారి

సోషల్ మీడియాలో చాలా అలెర్ట్ గా ఉండాలి. ముఖ్యంగా సెలబ్రిటీలు బిజీగా షెడ్యూల్స్ లో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా క్షణాల వ్యవధిలో నెగటివ్ విషయాలు వైరల్ అయిపోతాయి. నిన్న రాత్రి ఉస్తాద్ భగత్ సింగ్ ని ఉద్దేశించి ఒక అభిమాని బాబ్ రికార్డులు లేపేయాలనే అర్థం వచ్చేలా ట్వీట్ చేశాడు. దానికి స్పందించిన హరీష్ శంకర్ పూర్తిగా చదవకుండానే తథాస్తు అని బదులు ఇచ్చి రీ ట్వీట్ చేశారు. సెకండ్ల వ్యవధిలో జరిగిన తప్పును అర్థం చేసుకుని వెంటనే డిలీట్ చేశారు. ఈలోగానే దాన్ని స్క్రీన్ షాట్లు, వీడియో రూపంలో క్యాప్చర్ చేసిన ఇతర ఫ్యాన్స్ దాన్ని వైరల్ చేశారు. దీంతో మహేష్ బాబు ఫ్యాన్స్ కి ఆగ్రహం కలిగింది. రికార్డులు లేపేయాలని ఉద్దేశించి అతనెవరో పెట్టిన ట్వీట్ కి ఇలా రిప్లై ఇవ్వడం ఏమిటని హరీష్ ని నిలదీస్తూ ఆన్ లైన్ హంగామా చేశారు. డ్యామేజ్ చాలా దూరం వెళ్తోందని గుర్తించిన హరీష్ శంకర్ తాజాగా ఎక్స్ అకౌంట్ లో ఒక సుదీర్ఘమైన మెసేజ్ ద్వారా తన ఉద్దేశాలు వివరించి మనోభావాలు దెబ్బ తిన్న వాళ్లకు క్షమాపణ చెప్పారు. ప్రాక్టికల్ గా చూసుకుంటే స్టార్లను హ్యాండిల్ చేస్తున్న దర్శకులు ఎవరూ ఇతర హీరోల మీద మాట లేదా ట్వీట్ జారరు. దాని వల్ల పరిణామాలు తెలిసి ఉంటాయి కాబట్టి. కానీ కేవలం తొమ్మిది రోజుల రిలీజ్ ఒత్తిడి పెట్టుకున్న హరీష్ శంకర్ ట్వీట్ ని పూర్తిగా చూసుకోకుండా ఉత్సాహంతో ఇచ్చిన సమాధానం వ్యవహారాన్ని చాలా దూరం తీసుకెళ్లింది. వివరణ సందేశంలో అదే చెప్పారు. వారణాసి గురించి, గతంలో పోకిరి గురించి తాను గొప్పగా చెప్పినవి అందులో ఉదహరించారు. మొత్తానికి రాత్రి రచ్చ చేస్తున్న ఇష్యూ ఫైనల్ గా క్షమాపణ దగ్గర ఆగింది. గతంలో ఇదే తరహాలో ఒక అప్ కమింగ్





డైరెక్టర్ చిరంజీవిని ఉద్దేశించినట్టుగా ఉన్న పాత ట్వీట్ ఒకటి బయటికి తీస్తే దాన్ని ట్రోలింగ్ కోసం వాడుకున్న బ్యాచ్ పెద్దదే ఉంది. ఇలాంటివి పెద్దవి అయ్యేదాకా ఆగకూడదు. అందుకే హరీష్ శంకర్ వెంటనే డ్యామేజ్ కంట్రోల్ లోకి దిగిపోయారు. మార్చి 19 విడుదల కాబోతున్న ఉస్తాద్ భగత్ సింగ్ కు చివరి దశ పనులు ఆఘమేఘాల మీద జరుగుతున్నాయి. సెన్సార్ అయిపోయింది కాబట్టి టెన్షన్ లేదు.



# బిజినెస్ న్యూస్



## వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలపై నీళ్లు!



మిడిల్‌ఈస్ట్ ప్రాంతంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇరాన్ యుద్ధ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తోంది. ఇంధన ధరలు ఆకాశాన్ని తాకడంతో ద్రవ్యోల్బణం మళ్లీ కోరలు చాస్తోంది. దీనివల్ల ఇన్నాళ్లూ వడ్డీ రేట్ల తగ్గింపు కోసం వేచి చూసిన సామాన్యులకు, పెట్టుబడిదారులకు కేంద్ర బ్యాంకులు షాక్ ఇచ్చేలా కనిపిస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించడం పక్కన పెట్టి ఈ ఏడాది చివరి నాటికి మరింత పెంచే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక ప్రకారం, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ఈ ఏడాది ఒకటి లేదా రెండుసార్లు వడ్డీ రేట్లను పెంచవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో రేట్ల తగ్గింపు ఉంటుందని భావించినప్పటికీ చమురు, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడం దీనికి ప్రధాన కారణం. అదేవిధంగా, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ కూడా రేట్ల పెంపు దిశగా అడుగులు వేస్తోంది. గతంలో రేట్ల కోత ఉంటుందని ఊహించిన మార్కెట్ వర్గాలకు ఇది పెద్ద మలుపు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పుడు ద్రవ్యోల్బణంపై కేంద్ర బ్యాంకులు ఆలస్యంగా స్పందించాయనే విమర్శలు ఉన్నాయి. సాధారణంగా ఇంధన ధరల పెరుగుదల తాత్కాలికమని, అధిక ధరల వల్ల డిమాండ్ తగ్గి ధరలు అదుపులోకి వస్తాయని బ్యాంకర్లు భావిస్తారు. అయితే, గత అనుభవాల దృష్ట్యా ఈసారి ఆలస్యం చేయకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సెంట్రల్ బ్యాంకులు భావిస్తున్నాయి

## చికెన్, పిజ్జా, బర్గర్.. కంపెనీలకు కష్టాలు

దేశీయ క్విక్ సర్వీస్ రెస్టారెంట్ విభాగంపై గ్యాస్ సెగ ముసురుతోంది. వాణిజ్య ఎల్‌పీజీ సరఫరాలో ఏర్పడిన అంతరాయం, పెరుగుతున్న ధరల నేపథ్యంలో బుధవారం స్టాక్ మార్కెట్‌లో ప్రధాన క్యూఎస్‌ఆర్ కంపెనీల షేర్లు మిశ్రమంగా ట్రేడ్ అవుతున్నాయి. సరఫరా గొలుసులో తలెత్తిన సమస్యలు మరో రెండు వారాలకు పైగా కొనసాగితే కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందన్న విశ్లేషణలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ జేఎం ఫైనాన్షియల్ తాజా నివేదికలో క్యూఎస్‌ఆర్ విభాగం ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషించింది. ప్రధాన క్యూఎస్‌ఆర్ చైన్‌లో దాదాపు 60-65 శాతం వంట ప్రక్రియ పూర్తిగా ఎల్‌పీజీపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఈ సంస్థలు కేవలం ఒకటి నుంచి రెండు వారాలకు సరిపడా గ్యాస్ నిల్వలను మాత్రమే కలిగి ఉన్నాయి. సరఫరా లోటు కారణంగా మార్చి నెలలోనే వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర 8 శాతం మేర పెరిగింది. ఇది నేరుగా రెస్టారెంట్ల నిర్వహణ వ్యయాన్ని పెంచుతోంది. ఒకవేళ సరఫరా నిలిచిపోయి, రెస్టారెంట్లు ఐదు రోజుల పాటు మూతపడితే ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది. త్రైమాసిక ప్రాతిపదికన ప్రతి స్టోర్ ఆదాయం 6 శాతం తగ్గే అవకాశం ఉంది. రెస్టారెంట్ స్థాయి ఎబిటా మార్జిన్లు సాధారణం కంటే 14-20 శాతం మేర పడిపోయే ప్రమాదం ఉంది. సాధారణంగా ప్రభుత్వం గృహ అవసరాలకు వాడే గ్యాస్ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తుంది. ఈ క్రమంలో వాణిజ్య వినియోగదారులపై రేషనింగ్(ప్రాధాన్యత క్రమంలో పరిమితంగా పంపిణీ చేయడం) విధించడం రెస్టారెంట్లకు శాపంగా మారింది. పెద్ద సంస్థల కంటే చిన్న, స్వతంత్ర రెస్టారెంట్లు ఈ సంక్షోభానికి త్వరగా ప్రభావితమవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. హార్మూజ్ జలసంధి వంటి కీలక షిప్పింగ్ మార్గాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడం వల్ల ఎల్‌పీజీ దిగుమతులకు ఆటంకం కలుగుతోంది. ఈ అనిశ్చితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో రెస్టారెంట్ విభాగం ప్రత్యామ్నాయ ఇంధన వనరులు (విద్యుత్ ఆధారిత వంట పరికరాలు) లేదా సెంట్రలైజ్డ్ కిచెన్ మౌలిక సదుపాయాల వైపు మళ్లక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.




## రైల్వే కేటరింగ్‌కూ ఎల్‌పీజీ సెగ.. వెండర్లకు ఐఆర్‌సీటీసీ సూచనలు



దిల్లీ: దేశవ్యాప్తంగా వంటగ్యాస్ కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా కమర్షియల్ సిలిండర్ల సరఫరా తగ్గడంతో హోటళ్లు, రెస్టారంట్లు మూతపడుతున్నాయి. తాజాగా ఈ ప్రభావం రైల్వే కేటరింగ్‌నూ తాకింది. దీంతో ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ వెండర్లకు కీలక సూచనలు చేసింది. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరింది. రైల్వేస్టేషన్లలో ఉండే ఫుడ్ ప్లాజాలు, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, జనాహార్ కేంద్రాలకు ఐఆర్‌సీటీసీ మార్చి 10న ఓ అడ్వైజరీ జారీ చేసింది. ఎల్‌పీజీకి తీవ్రమైన కొరత ఏర్పడిన వేళ ప్రత్యామ్నాయ వంట పద్ధతులను అనుసరించాలని అందులో పేర్కొంది. ఎల్‌పీజీకి బదులు మైక్రోవేవ్‌లు, ఇండక్షన్ స్టవ్‌లు వినియోగించాలని తెలిపింది. పాసింజర్ డిమాండ్‌కు అనుగుణంగా రెడీ టూ ఈట్ ఫుడ్ ఐటెమ్స్‌ను తగినంత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వంటగ్యాస్ సరఫరా తగ్గింది. కృత్రిమ కొరతను నివారించడానికి కేంద్రం సిలిండర్ బుకింగ్ వ్యవధిని పెంచింది. ముఖ్యంగా గృహ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం చమురు కంపెనీలకు సూచించింది. దీంతో కమర్షియల్ సిలిండర్లకు కొరత ఏర్పడింది. ఫలితంగా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారంట్లపై ప్రభావం పడింది. పలు హాస్టళ్లు, మెస్‌లు తమ మెనూల నుంచి కొన్ని ఆహార పదార్థాలను తొలగిస్తున్నాయి. కొన్నిచోట్ల గ్యాస్ సిలిండర్లకు బదులు కట్టెల పొయ్యిలు, బొగ్గు కుంపట్లను వినియోగిస్తున్నారు.

## మార్కెట్ క్రాష్.. 1000 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణలకు ముగింపు ఎప్పుడో తెలియని అనిశ్చితి బుధవారం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దాంతో నేటి ట్రేడింగ్‌లో దేశీయ మార్కెట్ సూచీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి సెన్సెక్స్ ఒకదశలో 1000 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ 24వేల వద్ద కదలాడుతోంది. ఉదయం 11.50 గంటల సమయంలో సెన్సెక్స్ 943 పాయింట్లు క్షీణించి, 77,262 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 259 పాయింట్లు నష్టపోయి 24,002 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో జియో ఫైనాన్షియల్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సన్ ఫార్మా, అదానీ ఫార్మా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎంఅండ్‌ఎం, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలతో మన మదుపర్లు ఒత్తిడికి గురవుతున్నారు. దాంతో నిన్నటి లాభాలకు బ్రేక్ పడింది. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఇక ఈ యుద్ధం త్వరలో ముగియొచ్చని ట్రంప్ చెప్పినప్పటికీ.. పశ్చిమాసియాలో దాడులు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలు ప్రభావం చూపించాయి. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. ముడిచమురు ధరలు మంగళవారం ఒక బ్యారెల్‌కు 10 శాతానికి పైగా తగ్గినా.. అస్థిరతలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి. భారత్ ప్రధానంగా దిగుమతులపై ఆధారపడటమే ఇందుకు కారణం. దీంతో నేటి ట్రేడింగ్‌లో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు.. తర్వాత ఒక శాతం మేర కుంగాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 91.89గా ఉంది

# పుష్కరాలకు ముందే పోలవరం పూర్తికి సన్నాహాలు

## మంత్రి నిమ్మల



**పోలవరం, మార్చి 11 (నేటి మనదేశమ్) :** విదేశీ నిపుణుల సూచనలతో నాణ్యతలో రాజీ లేకుండా గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తికి సన్నాహాలు చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రంవాల్ నిర్మాణం, గ్యాప్-1, గ్యాప్-2, ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాం ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు కార్యాలయంలో జలవనరులశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ...రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయ డానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందన్నారు. గత ప్రభుత్వ పాలన నిర్లక్ష్యం వల్ల ధ్వంసమైన డయా ఫ్రంవాల్‌ను సరిచేస్తే సరిపోతుందని నిపుణులు చెప్పినా నాణ్యత, ప్రజా భద్రతల విషయంలో రాజీ పడకూడదనే కొత్త డయాఫ్రంవాల్ నిర్మించామని తెలిపారు. కొత్త డయాఫ్రంవాల్ నిర్మాణం 1,372 మీటర్లకుగాను 1300 మీటర్ల వరకూ పనులు పూర్తయ్యాయని, ఈ నెలాఖరు నాటికి డయాఫ్రంవాల్ నిర్మాణం పూర్తవు తుందని చెప్పారు.

ప్రాజెక్టు ప్రధాన కాలువల అను సంధాన పనుల్లో ముఖ్యమైన కుడి, ఎడమ కాలువలను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

'మా వల్లే మీకు పరిహారం వచ్చిందంటూ' దళారులు, మధ్యవర్తులు నిర్వాసితులను మోసం చేస్తు న్నారని, ఇటువంటి వారి పట్ల అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు.

# జాబ్ కేలండర్ విడుదల చేయాలి : డివైఎఫ్ఐ



**మాధవధార, మార్చి 11 (నేటి మనదేశమ్) :** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ విడుదల చేయాలని, గత ఐదేళ్లుగా రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున నిరుద్యోగుల వయోపరిమితి 47కు పెంచాలని డివైఎఫ్ఐ నాయకులు రాజు, శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బిర్లా జంక్షన్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు నోటిఫికేషన్లు లేవన్నారు. మూడు నెలలు క్రితం ముఖ్యమంత్రి 4.71 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారని, ఇప్పుడు యువజన సర్వీసుల శాఖ మంత్రి ఏకంగా 6.28 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని ప్రకటించడం యువతను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. కేవలం కార్పోరేట్ సంస్థలు ఇచ్చే కమిషన్ కోసం రాష్ట్రంలో ఉండే విలువైన భూములను లూటీ చేసి వారికి అప్పగించి బయట మాత్రం ఉద్యోగాలు వస్తాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రోజు రోజుకు నిరుద్యోగం పెరుగుతుంటే అసెంబ్లీలో చర్చించి యువతకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం లడ్డు చుట్టూ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు, లైబ్రరీయన్ పోస్టులు, యానిమల్ హస్బెండరి అసి స్టెంట్ పోస్టులను, ఇంజినీరింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పది వేలకుపైగా పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో గత ఐదేళ్లుగా 4వేలకు పైగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలి పారు. పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాంబాబు, సంతోష్, రమేష్, దేవుడు, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ, సమానత్వానికై ఐక్య ఉద్యమాలు



**పాలకొండ, మార్చి 11 (నేటి మనదేశమ్) :** దేశ వ్యాప్తంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యలు పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు మహిళలు సిద్ధం కావాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా, సిఐటియు, ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా స్థానిక డంపింగ్ యార్డు ఆవరణలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి.రామలక్ష్మి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి ఇటీవల మహిళల పట్ల తీవ్రమైన దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, బాలికలపై అత్యాచారానికి పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి మద్యం, డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా కావడమే ప్రధానమైన కారణమని, వీటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళలను ఉద్ధరిస్తామన్న పాలకులు రోజురోజుకు మహిళలపై భారాలు మోపుతున్నారని, ఇటీవల వంట గ్యాస్ ధరలు పెంచడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. ప్రభుత్వాలు ఆర్భాట ప్రచారాలు మాని మహిళల అక్షరాస్యత పెంపుదలకు, ఉపాధి కల్పించేందుకు, పని ప్రదేశాల్లో మహిళలు ఎదు ర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మహిళా హక్కుల సాధనకు, సమస్యల పరిష్కా రానికై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకట రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు మరిచర్ల సునీత, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వర రావు, ప్రజాసంఘాల నాయకులు ఇల్లా పార్వతి, ఆదిలక్ష్మి, దాలమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. మక్కువ : దేశంలో మహిళా రక్షణ చట్టాలు, హక్కుల కల్పన ప్రతిష్టంగా అమలు చేయా ల్సిన బాధ్యత ప్రభుత్వాల దేనని హెల్త్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఎన్.వర లక్ష్మి కాంతం పునరు ద్ఘాటించారు. మంగళవారం శ్రామిక మహిళ నాయకులు ఎల్.దాలమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శంబరలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పనిచేస్తున్నా నేడు అనేక ఆటంకాలు వస్తున్నాయని, మహిళలకు నేటికీ పని ప్రదేశాల్లో హక్కుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు మార్గం వైపు వెళ్లకుండా మరింత కఠినం చేసి, ఆంక్షలు విధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ రోజున గ్యాస్ ధరను పెంచడమంటే మహిళలపై మరింత భారం మోపినట్లు అవుతుందని వక్తలు తెలిపారు. స్త్రీ సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేసిన నాడే సమాజం మరింత ముందుకు వెళ్ల గలదని, అందులో భాగంగానే బాలిక నిర్బంధ, ఉచిత విద్యను మరింత పకడ్బందీగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# ఉచితంగా

## ఎలుకల నివారణ మందు పంపిణీ



**అమలాపురం మార్చి 11 (నేటి మనదేశమ్) :** అమలాపురం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతులకు ప్రభుత్వం ద్వారా బ్రోమోడయోలిన్ అనే ఎలుకల నివారణ మందును బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. పంటలకు ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుట, రైతులకు పంట సంరక్షణలో సహాయపడుట లక్ష్యంగా ఏ వేమవరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కె. ప్రవీణ్ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు ఎలుకల నివారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించడంతో పాటు, బ్రోమోడయోలిన్ మందును ఎలా ఉపయోగించాలో కూడా వివరించారు. రైతులు తమ పంటలను రక్షించుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధర పెంపును వ్యతిరేకిస్తూ

## పోస్టర్లు ఆవిష్కరణ



**పాలకొండ, మార్చి 11 (నేటి మనదేశమ్) :** బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ పాలకొండలో మంగళవారం నిర్వహించారు. సిఐటియు మండల అధ్యక్షులు బి.అమరవేణి అధ్యక్షతన జరిగిన పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణా రావు మాట్లాడుతూ యుద్ధం సాకుతో గ్యాస్ ధర పెంచడం వల్ల, సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండించారు. పశ్చిమ ఆసియాలో జరుగు తున్న యుద్ధం వల్ల గ్యాస్ ధరలు పెంచాల్సి వచ్చిందని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు పెద్ద కానుక ఇచ్చారని విమ ర్శించారు. పెంచిన గ్యాస్ ధరలు తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్యామల, జి.శారద, కె. శారద, ఎల్. జయమ్మ, ఎస్. రజిని, జి. జెస్సీబారు, రాధా రాణి, ప్రభావతి, పి.శ్రీదేవి, ధనలక్ష్మి, గౌతమి, ఆశా, అంగ న్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లేగదూడను చంపిన పులి



**పాలకొండ, మార్చి 11 (నేటి మనదేశమ్) :** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం మారేడుబాక పంచాయతీ జి.శరభవరం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో లేగదూడపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. గ్రామస్తుల కథనం మేరకు.. మంగళవారం తెల్లవారుజామున జి.శరభవరం గ్రామ సమీపంలో కోసూరువీధికి చెందిన గణపతికి చెందిన లేగదూడపై పులి దాడి చేసింది. దూడ మెడ భాగంలో తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మరణిం చింది. ఘటనా స్థలాన్ని సబ్ డిఎఫ్ఓ సుబ్బారెడ్డి, రాజవొమ్మంగి రేంజర్ ఉషారాణి, ఫారెస్ట్ సిబ్బంది పరిశీలించారు. పులి పాదముద్రలను గుర్తించారు. రెండు రోజులుగా ఆకలితో ఉన్న పులి మూగ జీవాలను మట్టుబెట్టే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని పరిసర ప్రాంతాల వారిని అధికారులు హెచ్చరించారు. పులిని బంధించేందుకు నాగార్జున సాగర్ నుంచి వచ్చిన ప్రత్యేక శిక్షణ పొందిన బృందం అటవీశాఖ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టింది. పెద్దపులి కదలికలను గుర్తించి సురక్షితంగా పట్టుకునేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దపులి కదలికలపై ప్రత్యేక అధికారి బిఎస్ఎన్ మూర్తి, సిసిఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, డిఎఫ్ఓ శివకుమార్ నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. పులి దాడి చేసి హతమార్చిన చిన్న పశువుకు రూ.ఐదు వేలు, పెద్ద పశువుకు రూ.15 వేలు నష్టపరిహారం అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు.

# బాణసంచా తయారీ కేంద్రాల్లో ఎస్‌పి తనిఖీలు



**కాకినాడ, మార్చి 11 (నేటి మనదేశమ్) :** జిల్లాలోని పలు బాణసంచా తయారీ కేంద్రాల్లో ఎస్‌పి బిందుమాధవ్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం కరప పోలీస్ స్టేషన్ పరిధిలోని వేలంగి, నడకుదురు, ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగనాపల్లి, కొవ్వూరు గ్రామాల్లోని బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పేలుడు పదార్థాల నిల్వ విధానం, భద్రతా చర్యలు, అగ్నిమాపక పరికరాల అందుబాటు, యూనిట్లకు సంబంధించిన లైసెన్సుల చెల్లుబాటు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. పేలుడు పదార్థాల చట్టం ఇతర భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని యాజమాన్యాలను ఆదేశించారు. యూనిట్ యజమానులు, కార్మికులతో మాట్లా డిన ఆయన పేలుడు పదార్థాలను అత్యంత జాగ్రత్తతో నిర్వహించాలని, భద్రతా పరికరాలు తప్పనిసరిగా వినియోగించాలని, అనధికారికంగా తయారీ లేదా నిల్వ చేయరాదని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘించే యూనిట్లపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసు కుంటామని ఎస్‌పి స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు తరచుగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.

# ఆరోగ్య సంరక్షణలో మహిళలు కీలకం

## డాక్టర్ డి.లక్ష్మి తులసి




**విశాఖపట్నం, మార్చి 11 (నేటి మనదేశమ్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని ఎండాడలో ఉన్న డాక్టర్ లూక్స్ క్యాంపస్, సెయింట్ లూక్స్ స్కూల్ & కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌తో కలిసి గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ "మహిళా నర్సులు: ఆరోగ్యవంతమైన విశాఖపట్నం నిర్మాణం" అనే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమా నికి జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.లక్ష్మి తులసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో నర్సులు పోషిస్తున్న కీలక పాత్రను ఈ సందర్భంగా వారు చాటిచెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో నర్సింగ్ సిబ్బంది కీలకంగా నిలుస్తారని చెప్పారు. వైద్య, నర్సింగ్ వృత్తిలో అధికంగా మహిళలు ఉంటారని సమాజ ఆరోగ్య పరిరక్షణలో మహిళలు ఎంతో ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. కుటుంబ ఆరోగ్యంతో పాటు వారు సమాజ ఆరోగ్యాన్ని నిరంతరం సంరక్షిస్తున్నారన్నారు. సెయింట్ లూక్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. ప్రభావతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమల్లి సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులు, అతిథులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

# వరికి మొవ్వు, దోమ పోటు సోకే అవకాశం



**పెద్దాపురం, మార్చి 11 (నేటి మనదేశమ్) :** వరి పంటలో వాతావరణ పరిస్థితులను బట్టి మొవ్వు పోటు, దోమపోటు అధికంగా సోకే అవకాశాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు ఎన్.విజరు కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లమూరు, గోరింట గ్రామాలలో వరి, మొక్కజొన్న, చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి చేలు అంకురం ఏర్పడే దశలో ఉన్నాయన్నారు. ఈ దశలో పొటాస్ ఎరువును వినియోగించడం వల్ల తెగుళ్లు, పురుగులను తట్టుకుంటుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులందరూ తప్పకుండా రిజిస్ట్రీ చేయించుకుని 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. రాబోయే కాలంలో ఈ విశిష్ట సంఖ్యను ఆధారంగా వ్యవసాయ శాఖ ద్వారా అందించే పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై ఎరువులు, ఇన్పుట్ సబ్సిడీలు రైతులకు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంజరుకుమార్, దేవళ్ల సతీష్ కుమార్, నీటి సంఘం అధ్యక్షులు దేవళ్ళ బోసు, డిజఏసు బాబు, ఎఎంసి డైరెక్టర్ జలదాని సుబ్రహ్మణ్యం, కర్రి భాస్కర్‌రాజు, పచ్చిపాల ఏసు, విఎఎలు, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పించాలి

**విజయనగరం, మార్చి 11 (నేటి మనదేశమ్) :** గుంకలాం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, స్థానికుల సమస్యలు పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మూడో కాలనీగా పేరు గాంచిన గుంకలాం జగనన్న లేఅవుట్‌లో కనీసం మౌలిక వసతులు లేవన్నారు. ప్రధాన రహదారి పాడైందని తెలిపారు. కాలనీలో 12,976 ఇళ్లు మంజూరు చేశారని, సుమారు 879 మంది ఆరు బ్లాకుల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు.

ఇక్కడ చదువుకునేందుకు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలు లేవని, తాగునీటి సౌకర్యం కల్పించలేదని చెప్పారు.

దొంగల బెడద తీవ్రంగా ఉందన్నారు. నైట్ పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు శాంతి, సుధామాధవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి మనదేశమ్ NETI MANADESAM



## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



**నరసరావుపేట, మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రముఖ ఫార్మా సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్ ఆధ్వర్యంలో మెగా క్యాంపస్ డ్రైవ్ జరిగింది. మొత్తం 92 మంది విద్యార్థులు పాల్గొనగా 19 మంది విద్యార్థులు ప్రొడక్షన్, సూపర్‌వైజర్, కెమిస్ట్, అనలిస్ట్ విభాగాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.2.6 లక్షల జీతంతో హైదరాబాద్, వైజాగ్, కాకినాడ ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గారు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## వ్యాయామం సర్వరోగనివారిణి

**– కెయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. రాంబాబు**

**– వర్సిటీ తైక్వాండో జట్టు ఎంపిక**



**మచిలీపట్నం మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నేటి కాలమాన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కనీసం అర్ధగంట వ్యాయామం చేయడం అవసరమని, అలా చేయకపోతే ఎన్ని లక్షలు ఉన్నా ఎవరు కాపాడలేరని కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. బుధవారం విశ్వవిద్యాలయ ఇండోర్ స్టేడియం లో అంతర్ విశ్వవిద్యాలయ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు, కృష్ణా విశ్వవిద్యాలయం జట్టు ఎంపిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులే నిజమైన ఆరోగ్యవంతులు అని, వారిని చూసి తమ జీవన విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించారు. తదుపరి కృష్ణా విశ్వవిద్యాలయ జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.గోపి, తైక్వాండో రిఫరీ లు, పలు కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ లు పాల్గొన్నారు.

## ఇష్టంతో చదవాలి..

**ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి: ఎంఈవో**



**కోటనందూరు మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మధ్యాహ్న భోజనం శుచి, శుభ్రతతో అందించాలని ఎంఈవో శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. పి. కొట్టాం జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు దగ్గరవుతున్న నేపథ్యంలో వారు ఆందోళన చెందకుండా పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు ఇష్టంతో చదివి.. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. వందశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యం, పాఠశాల నిర్వహణ, దస్త్రాలు తదితర అంశాలపై చర్చించారు.

## అభివృద్ధికి సహకరించండి: ఎంపీపీ



**కలసపాడు మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని మండల అధ్యక్షురాలు (ఎంపీపీ) బి. నిర్మలాదేవి కోరారు. బుధవారం కలసపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మహబూబ్‌బీ, పశు వైద్యాధికారి వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. అనంతరం ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఎ.పెద్దగురివిరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహబూబ్ బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేట మున్సిపాలిటీలో అపరిశుభ్ర రాజకీయం

## కాగితాల్లోనే కార్మికులు.. జేబుల్లోకి జీతాలు!



**చిలకలూరిపేట మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తెల్లవారకముందే “అయ్యా.. వచ్చానయ్యా.. ఎస్సార్!” అంటూ పారిశుధ్య కార్మికుల పిలుపులతో మున్సిపల్ కార్యాలయం ప్రతిధ్వనిస్తుంది. అటెండెన్స్ వేయించుకుని, కొందరి మార్గదర్శకత్వంలో వార్డుల బాట పట్టే కార్మికులు చేసే సేవ వెలకట్టలేనిది. వారు ఒక్కరోజు రాకపోతేనే పట్టణం దుర్వాసనతో నిండిపోతుంది. కానీ, అదే కార్మికుల ముసుగులో చిలకలూరిపేట మున్సిపాలిటీలో కొందరు అధికారులు సాగిస్తున్న అక్రమాల పర్వం ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్ గా మారింది.

ఘోస్ట్' వర్కర్ల హల్చల్.. అటెండెన్స్ పక్క రాష్ట్రంలో!?
మున్సిపాలిటీలో ముఖ్యంగా శానిటేషన్ డివిజన్–2 పరిధిలో వింతలు, విశేషాలు వెలుగుచూస్తున్నాయి. సుమారు 160మంది అవుట్‌సోర్సింగ్, మరి కొంతమంది పర్మనెంట్ కార్మికులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది.

పక్క రాష్ట్రంలో ఉంటూ ఇక్కడ జీతంలి: ఈ డివిజన్‌లో పనిచేసే ఒక మహిళా కార్మికురాలి పేరు అటెండెన్స్ రిజిస్టర్‌లో ఉంటుంది కానీ, ఆమె మాత్రం పక్క రాష్ట్రంలో నివసిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అజ్ఞాత కార్మికులు: మరో నలుగురు కార్మికులు అటెండెన్స్ పలుకుతారు కానీ, వారు అసలు ఎవరో, ఎక్కడ ఉంటారో తోటి కార్మికులకు కూడా తెలియదు.(కొన్ని కారణాల వల్ల వారి పేర్లు వార్త లో పెట్టటం లేదు)ఉన్నతాధికారులు తనిఖీకి వస్తే, అక్కడ ఉన్న ఇతర వర్కర్లే వారి పేర్లు పలకడం ఇక్కడ రివాజుగా మారింది.

అధికారుల ముందు జాగ్రత్త:లి ఒక కార్మికుడికి జనవరి 15 నుండి అటెండెన్స్ వేయకుండా నిలిపివేయడం అధికారుల డొల్లతనం బయటపడుతుందని మచ్చరు ను నిలిపివేశారు.

అధికారుల జేబుల్లోకి కార్మికుల కష్టం?లి
అటెండెన్స్ వేయించుకుని వెంటనే పది నుండి ఇరవై మంది ఇళ్లకు వెళ్లిపోతుంటారని సమాచారం. ఇలా పనిచేయని రోజులకు గాను, ఒక్కో కార్మికుడి నుండి సుమారు 500 రూపాయల చొప్పున అధికారుల జేబుల్లోకి వెళ్తున్నట్లు కార్మికుల మధ్య గుసగుసలు వినిపిస్తున్నాయి. “అటెండెన్స్ మాది.. ఆదాయం అధికారులది” అన్నట్లుగా ఇక్కడ పరిస్థితి తయారైంది.

కొండల సాకు.. పట్టణంలో నరకం!లి
ఇటీవల పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురుగు కాలువలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే.. “కోటప్పకొండ, కొండవీడు, సీఎం మీటింగ్ డ్యూటీలతో బిజీగా ఉన్నాం.. అందుకే పట్టణాన్ని పట్టించుకోలేకపోయాం” అంటూ నిర్లక్ష్యపు సమాధానాలు ఇస్తున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ కునల ప్రమీల సైతం, “డివిజన్ కు 180 మంది కార్మికులు ఉన్నప్పుడు, రెండు,మూడు వీధుల్లో కేవలం ఇద్దరే ఎందుకు కనిపిస్తున్నారు?” అని నిలదీయడం ఈ అక్రమాల తీవ్రతను చాటిచెబుతోంది.

ప్రజాధనం ఏమవుతోంది
ఒకవైపు యూజర్ చార్జీల పేరుతో ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న అధికారులు, మరోవైపు పారిశుధ్య కార్మికుల పేర్లతో ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని, సమగ్ర విచారణ జరిపి, ఈ ‘అవినీతి తిమింగలాల’ నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని రాజకీయ పార్టీల నేతలు మరియు పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గమనిక ఒక డివిజన్ ఒక ఏరియాలోనే ఈ విధంగా ఉంటే, మరి మిగతా డివిజన్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలియాల్సి ఉంది.

# బచ్చుపేట వెంకటేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణం



**మచిలీపట్నం మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** స్థానిక బచ్చుపేటలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు బుధవారం నూతన పాలకమండలి చైర్మన్ గా ముత్తేవి రవికాంత్ ప్రమాణస్వీకారం చేశారు. పాలకమండలి సభ్యులుగా ఐనంపూడి రాజశేఖర్, తాడేపల్లి హరి గోపాల్ రావు,తోట లక్ష్మీకుమారి, బోయిన నాగలక్ష్మి, పిట్టా సౌమ్యశ్రీ, ఎం.లావణ్య, చలమల శెట్టి రామకృష్ణ గాంధీ, కొడాలి వెంకటేశ్వరమ్మ, ఆరెపల్లి దుర్గాభవాని, దేవరపల్లి చక్రవర్తి,ముత్తెవి కృష్ణప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, టిడిపి కార్పొరేటర్ దేవరపల్లి అనిత, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పివీ ఫణి కుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు లోగిశెట్టి వెంకటస్వామి, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పిడియస్ రైస్ సీజ్

**అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లై అధికారులు**



**మచిలీపట్నం మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సివిల్ సప్లై అధికారులు చాలా కాలం గ్యాప్ తర్వాత పి.డి.యస్ రైస్ పై దృష్టి సారించి లోడ్ లారీ రైస్ ను స్వాదీనం చేసుకున్నారు. అప్పటికే లారిలో తీరుబడిగా బియ్యం బస్తాలు లోడు పూర్తి చేసుకొని బయలుదేరడానికి సంసిద్ధం అవ్వడం ఇనుగుదురుపేట పోలీసుల కంటపడింది. వెంటనే స్పందించిన పోలీసులు సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్తలికి చేరుకున్న సివిల్ సప్లై అధికారి దగ్గరుండి గోడౌన్ లో ఉన్న మిగిలిన బియ్యం బస్తాలను కూడా లారిలోకి ఎక్కించి లారీని స్వాదీనం చేసుకున్నారు. యజమానిపై 6ఎ కేసు నమోదు చేసి కోర్టు లో హాజరు పరుస్తామని సివిల్ సప్లై అధికారి తెలిపారు.

## నాణ్యమైన విద్య.. ప్రభుత్వ పాఠశాలల్లోనే సాధ్యం



**కలసపాడు మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పిల్లల సర్వతోముఖాభివృద్ధికి కావాల్సిన నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి, క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు జె.మెర్సీమాలిని పేర్కొన్నారు. బుధవారం కలసపాడు మండలం ఎగువ తంబళ్లపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 51వ వార్షికోత్సవ వేడుక ప్రధాన ఉపాధ్యాయుడు ఎన్.రవివిజయక్రీస్తుదారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అనేక రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఎన్నో ప్రయోజనాలున్న ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. దాత ఎన్.వెంకటేశ్వర ఆచారి పాఠశాలకు సౌండ్ సిస్టం, ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు.

## ఒంటిమిట్ట తితిదే విశ్రాంతి భవనం పరిశీలన



**ఒంటిమిట్ట మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఒంటిమిట్టలో తితిదే విశ్రాంతి భవనాన్ని బద్వేలు ఆర్డీవో ఎ.చంద్రమోహన్ బుధవారం పరిశీలించారు. కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి శ్రీరామ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇందులో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహించాలని తితిదే అధికారులు నిర్ణయించారు. రాములోరి పెళ్లికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. అదే రోజు రాత్రి సీఎం చంద్రబాబు ఇక్కడ బస చేయనున్నారు. ఈ నేపథ్యంలో తితిదే విశ్రాంతి భవనంలో జరుగుతున్న ఏర్పాట్లను బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించి, తితిదే ఈఈ సుమతి, డీఈ నాగరాజు, ఏఈ అమర్ నాథ్ రెడ్డి, తహసీల్దారు దామోదర్ రెడ్డితో చర్చించారు.

## పదో తరగతి విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

**: మంత్రి మండిపల్లి**



**రాయచోటి మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష కేంద్రం వరకు ఉచిత బస్ ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ నెల 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఉంటుందని తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. బస్‌లో హాల్‌టికెట్ చూపిస్తే చాలని తెలిపారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా 6.42 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. దీని కోసం మొత్తం 3,415 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి.

# పల్నాడు జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## నోడల్ ఆఫీసర్ శైలజ




**నరసరావుపేట, మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని పల్నాడు జిల్లా నోడల్ అధికారి మరియు జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ పి శైలజ అన్నారు. బుధవారం నరసరావుపేట లోని కేసానుపల్లి లో పీూవీ కాలేజీలో మండల విద్యాశాఖ అధికారుల, చీఫ్ సూపర్డెంట్ల, డిపార్ట్మెంట్ అధికారుల మరియు రూట్ అధికారుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో పదో తరగతి పరీక్షలు ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని, మండల విద్యాశాఖ అధికారులు తమ మండల పరిధిలో గల పరీక్షా కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి అక్కడ ప్రతిరూములో బెంచీలు,, లైట్లు, ఫ్యాన్లు ఉండే విధంగా, పరిసరాలన్నీ శుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని, పరీక్షా కేంద్రంలో మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు పరీక్షా కేంద్రాలలో ఏ ఒక్క విద్యార్థి నేల మీద కూర్చుని పరీక్ష రాయకూడ దని,పరీక్షల పట్ల నిర్లక్ష్యం తగదని, పరీక్షా కేంద్రాల్లో తప్పక పోలీస్ బందోబస్తు, మెడికల్ సిబ్బందిఏర్పాటు చేసుకోవాలని అన్నారు పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ పివిజే రామారావు మాట్లాడుతూజూ మరియు డివో లు పోలీస్ స్టేషన్ నుండి పాఠశాలకు ప్రశ్నాపత్రాలు తరలించే క్రమంలో తప్పక పోలీసుఎస్కార్ట్ తో వెళ్లాలని, ప్రతి మండల విద్యాశాఖ అధికారి మండలంలో అందుబాటులో ఉండాలని అన్నారు పరీక్షా కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే నోడల్ అధికారి వారికి గాని, మాకు గాని తెలియజేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో చామీూ పూర్ణచంద్రరావు, ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారు లు మరియు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో హుండీల లెక్కింపు.. రికార్డు స్థాయిలో ఆదాయం



**విడపనకల్లు మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం ఉండబండ శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో హుండీల లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి రంగస్వామి నాయుడు, ఆలయ ఈవో విజయ్ కుమార్ ఆధ్వర్యంలో హుండీలను తెరచి లెక్కింపు చేపట్టారు. 9 నెలలకుగాను రూ.14,18,454 నగదు, 150 గ్రాముల వెండి కానుకల రూపంలో వచ్చిందని ఆలయ ఈవో విజయ్ కుమార్ తెలిపారు. గతంతో పోలిస్తే ఈ సారి రూ.1,55,426 ఆదాయం పెరిగిందన్నారు. ఇప్పటివరకు లేనంతగా రికార్డు స్థాయిలో హుండీల రూపంలో ఆలయానికి ఆదాయం సమకూరిందని ఈవో పేర్కొన్నారు.

## ఘనంగా సుగుటూరు గంగమ్మ జాతర



**పుంగనూరు మార్చి 11 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పట్టణంలోని నగరివీధిలో సుగుటూరు గంగమ్మ జాతర మంగవారం రాత్రి ప్రారంభమైంది. ఏటా హోలీ పండుగ తర్వాత వచ్చే మంగళ, బుధవారాల్లో ఈ జాతర నిర్వహించడం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ. ఈ జాతరలో తొలి పూజకు ఓ ప్రత్యేకత ఉంది. జాతర నిర్వాహకులు, జమీందారుల తర్వాతే ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ పూజలు చేస్తారు. అనంతరం ఆలయంలో కొలువుతీరిన అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు. అనంతరం జలధికి తరలిస్తారు. భక్తుల రద్దీ దష్ట్యా ఎస్పీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో పేరొందిన అష్ట గంగమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and
Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com